ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 30.0
కనిష్ఠం : 20.0

కోట్లు.. కొల్లగొట్టి..!



జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో కోడి పందేలు

పందెం కోసం పరుగులు పెట్టారు. పార్టీలకు అతీతంగా బరులు పంచుకున్నారు. మొహమొహాలు చూసుకోకున్నా కట్టలకు కట్టలు కుమ్మరించారు. బౌన్సర్లను కాపలా పెట్టి మరీ బరులకు భద్రత పెంచుకున్నారు. హైకోర్టు ఆదేశాలు, పోలీసు హెచ్చరికలను పందెం రాయుళ్లు బేఖాతరు చేశారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా భోగి, సంక్రాంతి, కనుమ మూడురోజుల పండుగకు కత్తులు కట్టిన కోళ్లతో యథేచ్ఛగా పందేలు నిర్వహించారు. కోడి పందెం రాయుళ్లు ఆదివారం ఉదయం నుంచే పందేలు మొదలు పెట్టేశారు. కొద్దిరోజుల నుంచి పోలీసులు, రెవెన్యూ అధికారులు హెచ్చరికలు చేస్తున్నా, బైండోవర్ కేసులు కట్టినా ఇవన్నీ హైకోర్టుకు చూపించుకోవడానికే మాత్రమే అంటూ పందెం రాయుళ్ళే చెప్పుకోవడం విశేషం. జిల్లాలో చాపకింద నీరులా పదిహేను రోజుల నుంచే స్టేషన్ రైటర్లు పందెం రాయుళ్ళను బైండోవర్ కేసులు పేరుతో స్టేషన్‌కు పిలిపించి లక్షల రూపాయల ఒప్పందాలు చేసుకుని కోడిపందేల నిర్వహణకు అనుమతులు ఇచ్చినట్టు తెలుస్తోంది. కోడిపందేల్లో గుండాట, పేకాట, మద్యం అమ్మకాలు నిర్వహించేందుకు కోడిపందేల నిర్వాహకులు లక్షల రూపాయలు వసూలు చేసుకున్నారు. ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే ఈ వ్యవహారం అంతా మండలస్థాయి నాయకులు వసూలు రాజాగా నిర్వహించి అటు పోలీసులు, రెవెన్యూ అధికారులను, ఇటు ప్రజా ప్రతినిధికి తమదైన శైలిలో కానుకలు సమర్పించుకున్నట్టు తెలుస్తోంది. ఆదివారం ఉదయం నుంచే జిల్లావ్యాప్తంగా కోడిపందేలు యథేచ్ఛగా ప్రారంభించి మంగళవారం సాయంత్రం వరకు జరిగాయి.

ఏలూరు, (ఆంధ్రజ్యోతి)/ఏలూరు క్రైం/ఏలూరు రూరల్/జంగారెడ్డిగూడెం /కలిదిండి/నిడమర్రు/ద్వారకాతిరుమల, జనవరి 16 :

ఏలూరు రూరల్ మండలంలోని చొదిమెళ్ల, గుడివాకలంకతో పాటు ఉంగుటూరు, జంగారెడ్డిగూడెం మండలం చక్కెర దేవరపల్లి (కొంగవారిగూడెం), లక్కవరం, శ్రీనివాసపురం, బొర్రంపాలెం అడ్డరోడ్డు, కామవరపుకోట మండలం రావికంపాడు, పెదవేగి, రాయుడుపాలెం, టి.నర్సాపురం, నూజివీడు మామిడితోటలు, కైకలూరు, ముదినేపల్లి, కలిదిండి, మండవల్లి తదితర మండలాల్లో పందెం బరులు జోరుగా సాగాయి. ఆయా బరుల శిబిరాల్లోనే అందుబాటులో ఉన్న లోన-బయట, గుండాట, ఇతర జూదాలతో కలిపి ఏలూరు జిల్లాలోనే రూ.200 కోట్ల వరకు పందేలు జరిగాయని సమాచారం. గతేడాదితో పోలిస్తే, ఈసారి భారీ పందేలు కాసే నాయకులు,ఆసక్తి గల వారందరూ, పశ్చిమ గోదావరి, కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల వైపు మొగ్గు చూపారు. జిల్లాలోని పలు బరుల్లో అడపా దడపా ఘర్షణలు, వివాదాలే తప్ప చెప్పుకోదగ్గ నేరాలు జరగలేదని అధికారులు వివరిస్తున్నారు. ఆగిరిపల్లి మండలం అమ్మవారిగూడెంలో కోడి పందేల శిబిరంలో ఘర్షణ జరిగింది. మండలం కూచింపూడిలో గుండాటలో భాగంగా గొడవలు జరగ్గా, ఇరువర్గాల మధ్య వివాదం రేగింది. భీమడోలు మండలం గుండుగొలను హౌసింగ్ బోర్డు కాలనీలో కోడి పందేలు, పేకాటలు నిర్వహించగా, దెందులూరు మండలం గంగన్నగూడెంలో భారీగా బరిని చేపట్టారు.



ఏలూరు తంగెళ్లమూడిలో కోడి పందేలు

యథేచ్ఛగా కోడి పందేలు

- తోడైన గుండాట, పేకాట
- హైకోర్టు ఆదేశాలున్నా బేఖాతరు..
- ఉమ్మడి పశ్చిమలో చేతులు మారిన కోట్లు
- ముగిసిన సంక్రాంతి సంబరాలు
- మూడు రోజుల్లో రూ.21 కోట్ల మద్యం తాగేశారు

ఒత్తిళ్లతో పందేలకు గ్రీన్‌సిగ్నల్

రాజకీయ నాయకులు రాష్ట్రస్థాయిలో ఒత్తిళ్లు తీసుకువచ్చి చివరకు రాష్ట్రస్థాయి అధికారులతోనే జిల్లా యంత్రాంగంపై ఒత్తిళ్ళుచేసి పందేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చుకున్నట్టు అయింది. చట్టాన్ని కాపాడాల్సిన అధికారులు రాజకీయనాయకుల ఒత్తిళ్ళకు తలొగ్గారంటూ విజ్ఞులు విమర్శిస్తున్నారు. జిల్లాలో గత 20 ఏళ్ళగా జిల్లా పరిస్థితిని సంక్రాంతి సమయంలో పరిశీలిస్తే ఇద్దరు ఎస్పీలు మాత్రమే జిల్లాలో కోడిపందేలు నిర్వహించకుండా పనిచేశారు. ఒకరు డైరెక్ట్‌గా ఐపీఎస్ అధికారి కాగా, మరొకరు గ్రూప్‌వన్ అధికారిగా పోలీస్ శాఖలో ప్రవేశించి ఆ తరువాత ఐపీఎస్ పొంది జిల్లా ఎస్పీగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ జిల్లాలోనే ఆరు నెలల్లో పదవీ విరమణ పొందుతారు అనే సమయంలోనే ఆయన కోడిపందేలు ఆపి చరిత్ర సృష్టించారు. మరో ఐపీఎస్ అధికారి జిల్లాలోని అసిస్టెంట్ ఆఫ్ సూపరింటెండెంట్ పోలీస్‌గా పనిచేసి ఆ తరువాత ఉన్నతాధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన కూడా కోడిపందేలు ఆపే ప్రయత్నం చేయగా చివరకు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో అత్యవసర మీటింగ్ ఉందంటూ అప్పటి ఉన్నతాధికారులు ఇద్దరు ఐపీఎస్ అధికారులను ఆ మూడు రోజులు అక్కడే ఉంచి ఇక్కడ కోడి పందేలకు ఆటంకం లేకుండా అప్పటి ప్రభుత్వం జాగ్రత్త పడింది. ప్రస్తుతం కూడా ఇవే పరిస్థితులు ఎదురవుతాయేమో అనుకున్నారేమో కాని పోలీసు అధికారులు మాత్రం ఉన్నతాధికారుల ఆదేశాలకు, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ళకు తలొగ్గి సెల్యూట్ చేశారు. నిర్భయంగా, బహిరంగంగా రోడ్డుపక్కనే కోడి పందేలు, గుండాటలు, పేకాటలు యథేచ్ఛగా నిర్వహించారు.

చేతులు మారిన రూ.200 కోట్లు

జిల్లాలో ఈ మూడు రోజుల్లో 150 కోట్ల నుంచి 200 కోట్ల రూపాయల వరకూ పందేల పేరుతో జూదం, గుండాటలలో చేతులు మారాయని తెలుస్తోంది. కొన్ని పందేల వద్ద కూర్చుని పందెం చూడడానికి రూ.200 నుంచి రూ.1000 వరకూ టిక్కెట్ పెట్టేశారు. ఇంకా బుల్లెట్లు, ఇతర వాహనాలను బంపర్ బహుమతి అంటూ పందేల్లో బహుమతులు పెట్టారు. మొత్తం మీద సంక్రాంతి పండుగ, కనుమ ముగింపు జరుగడంతో పోలీసులు మంగళవారం సాయంత్రం నుంచి కోడి పందేలా శిబిరాలపై దాడులు మొదలు పెట్టారు. హడావుడిగా పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారు. పందేలకు అనుమతి ఇచ్చిననాడు ముందస్తు ఒప్పందాల మేరకే ఈ కేసులు నమోదు చేస్తున్నారని తెలుస్తోంది.

పండుగంతా బరుల్లోనే..!

సంక్రాంతి పండుగ పురస్కరించుకుని కోడి పందేలు మూడు రోజులు కూడా రాత్రింబవళ్ళు తేడా లేకుండా వేలాదిమంది పందేలను వీక్షిస్తూ పండుగంతా పందెం బరుల వద్దే గడిపారు. కోట్లాది రూపాయలు చేతులు మారాయి.

కోడి పందేలు పేకాటపై కేసులు

ఏలూరు క్రైం, జనవరి 16 : జిల్లాలో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలలో పోలీసులు పేకాట కోడి పందేలపై కేసులు నమోదు చేశారు. మూడు, నాలుగు ఏపీ గేమింగ్ యాక్ట్ కింద పోలవరం పోలీసులు మంగళవారం ఒక కేసు నమోదు చేసి 15మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 80 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాటలపై జిల్లా వ్యాప్తంగా గత మూడు రోజుల్లో 204 కేసులు నమోదు చేసి 513 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.8,14,038 నగదు స్వాధీనం చేసుకున్నారు కోడిపందేలపై 287 కేసులు నమోదు చేసి, 696 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి మూడు లక్షల 33 వేల ఎనిమిది వందల నలభై ఐదు రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు. 306 కోడిపుంజులు, 391 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు.

తెలంగాణ నుంచి రాక

భీమవరం : పశ్చిమ గోదావరి జిల్లాకు తెలంగాణ, రాయలసీమ జిల్లాలనుంచి పందెం రాయుళ్లు అధికంగా తరలివచ్చారు. భారీ మొత్తంలో పందేలు కాశారు. మూడు రోజులపాటు మద్యం ఏరులై పారింది. ప్రభుత్వానికి మూడు రెట్లు ఆదాయం లభించింది. మహిళలు సైతం కోడి పందేలకు సై అన్నారు. పందేలు కాశారు. కుటుంబాలతో సహా పందేలను తిలకించారు. ఈసారి అర్కెస్ట్రాలు, నృత్యాలు ఏర్పాటుచేశారు. కాళ్ల మండలం పెదఅమిరంలో పాస్‌లు కల్పించారు. వారికే బరిలోకి అనుమతి ఇచ్చారు. కోడితోపాటు బరిలో దిగే వారికి గుర్తింపు కార్డులు మంజూరు చేశారు. ఇతరులకు బరిలోకి అవకాశం కల్పించలేదు. ఈ ఏడాది ఒక్కో పందేనికి రూ.50 లక్షల వంతున కాసి రికార్డు నెలకొల్పారు. కోడితో బరిలో పాల్గొనాలంటే ఒక పందేనికి రూ.50 లక్షలు చెల్లించాలి. పెదఅమిరంలో ఒక్క పందెంలోనే రూ.3 కోట్లు మేర లావాదేవీలు సాగాయి. సీసలిలో అన్ని పార్టీల మద్దతుదారులు బరి నిర్వహించారు. అక్కడ గరిష్ఠంగా రూ.40 లక్షల వరకు పందెం వెళ్లింది. ఆ రెండు బరుల్లోనే మూడు రోజులపాటు కోట్ల రూపాయలు చేతులు మారాయి. ఉండి నియోజకవర్గంలోని ఓ బరిలో ఐదు పందేలు కోటి రూపాయల వరకు వెళ్లాయి. అంటే ఒక్కో పందేనికి రూ.20 లక్షల వంతున బెట్టిం గ్‌లకు పాల్పడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా మూడు రోజులపాటు రూ.600 కోట్ల మేర కోడి పందేలు, గుండాట, కోతాటల్లో చేతులు మారినట్టు అంచనా వేస్తున్నారు.

ప్రజాప్రతినిధులు దూరం

ఈసారి ముఖ్య ప్రజాప్రతినిధులు పందేలకు దూరంగా ఉన్నారు. గతంలో ఉత్సాహంగా బరులు ఏర్పాటు చేసి ప్రారంభించేవారు. ఈసారి వాటికి దూరంగా ఉన్నారు. తమ పార్టీ శ్రేణులు బరులు నిర్వహించుకునేలా అవకాశం కల్పించారు. అంతా ఎన్నికల మూడ్‌లో ఉండడం వల్లే వారు దూరమయ్యారు.



కొండలరావుపాలెంలో పందేలు తిలకిస్తున్న మహిళలు

జంగారెడ్డిగూడెంలో ఒక్కో పందెం రూ.5వేల నుంచి రూ.లక్షలకు పైగానే జరిగాయి. పండుగ పురస్కరించుకుని కొత్త సినిమాలు విడుదల కావడంతో థియేటర్లన్నీ కిక్కిరిశాయి. కుటుంబ సమేతంగా చాలామంది థియేటర్లకు వెళ్లడంతో థియేటర్లు కళకళలాడాయి.

రూ.21 కోట్ల మద్యం తాగేశారు



కరోనా కష్టకాలం తరువాత సంక్రాంతి పండుగను ఈ ఏడాదే ప్రజలు సంతోషంగా, సుఖంగా జరుపుకున్నారని చెప్పవచ్చు. పది రోజుల నుంచి జిల్లాలో షాపింగ్‌మాల్స్, పలు షాపులు కిటకిటలాడి వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లాయి. జిల్లాలో 140 ప్రభుత్వ మద్యం షాపులు, వాకిన్ స్టోర్లు 12, బార్లు 16 ఉన్నాయి. ఈ ఏడాది గత ఏడాది డిసెంబరు 30న నాలుగు కోట్ల మద్యం, డిసెంబరు 31న ఆరు కోట్లు, జనవరి ఒకటిన ఆరున్నర కోట్ల మద్యం తాగారు. మొత్తం మీద నూతన సంవత్సరం సందర్భంగా పదహారున్నర కోట్ల రూపాయల మద్యాన్ని మద్యం ప్రియులు తాగేశారు. ఇప్పుడు సంక్రాంతి సందర్భంగా భోగి రోజు ఆరు కోట్ల 75 లక్షల రూపాయల మద్యం, 15న సంక్రాంతి సందర్భంగా ఏడు కోట్ల రూపాయల మద్యం, 16న కనుమ సందర్భంగా ఏడు కోట్ల 25 లక్షల రూపాయల మద్యాన్ని మద్యం ప్రియులు తాగేశారు. ప్రభుత్వం మాత్రం తాము వేసిన అంచనా మద్యం మద్యం ప్రియులు తాగలేదంటూ గణాంకాలు సరిచూసుకుంటున్నారు. మొత్తం మీద సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల్లో 21 కోట్ల రూపాయల మద్యం అమ్మకాలు జిల్లాలో జరిగాయి.



విజేత ప్రసాద్‌కు బుల్లెట్ అందిస్తున్న రామారావు

బుల్లెట్‌లను గెలుచుకున్న పందెం రాయుళ్లు

కలిదిండి / పెదవేగి : కలిదిండిలో మంగళవారం నిర్వహించిన కోడి పందేల్లో కొండూరుకు చెందిన అంజూరి ప్రసాద్, జంగారెడ్డిగూడెంకు చెందిన తల్లాడి సత్తిబాబు బుల్లెట్‌ల ను గెలుచుకున్నారు. మొత్తం పదకొండు కోడి పందేలు వేర్వేరుగా నిర్వహించగా, వీటిలో ఎక్కువ పందేలు గెలిచిన అంజూరి ప్రసాద్, తల్లాడి సత్తిబాబులకు నిర్వాహకులు పోసిన చెంచు రామారావు, బాలిన రాంబాబు బుల్లెట్‌లను చేరొకటి ప్రదానం చేశారు. మూడు రోజులుగా కలిదిండి పందేల బరిలో బుల్లెట్‌లను ప్రదర్శనగా ఉంచారు. పెదవేగి మండలం కొండలరావుపాలెంలో ముసుగు పందేలు మూడు వేశారు. పెదకడిమి సొసైటీ అధ్యక్షుడు చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు బుల్లెట్ వాహనాన్ని గెలుచుకున్నారు.

చచ్చి గెలిచిన 'కోజా'.. యమ డిమాండ్..



నిడమర్రు/ద్వారకా తిరుమల : పందెంలో ఓడిపోయిన కోడిపుంజును కోజాగా పిలుస్తారు. పందెంలో గెలిచిన కోడి కంటే ఓడిన కోడిపుంజుకే డిమాండ్ ఎక్కువ ఏర్పడింది. కోడిపందెం పోరాటంలో ఓడిపోయి చచ్చిపోయిన కోడి మాత్రం గెలిచినట్టయింది. చనిపోయిన కోజా కోసం ఉన్నతస్థాయి అధికారులు వద్ద నుంచి, అటు రాజకీయ నాయకులు వద్ద నుంచి తీవ్ర డిమాండ్ ఏర్పడింది. పందేలకు పెంచే సమయంలో వీటికి బాదంపప్పు, జీడిపప్పు, పిస్తా, ఖీమా వంటి బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తారు. దీనివల్ల మంచి రుచి వస్తుందని మాంసం ప్రియులు ఎగబడుతుంటారు. ద్వారకాతిరుమల మండలంలో ఒక్కో కోజా రూ. 3000 నుంచి రూ.5000 వరకు పలికింది.

మూడు రోజుల లెక్కలు ఎంత !

నిడమర్రు : పండుగ మూడు రోజులు మంగళవారం పూర్తికావడంతో కోడి పందేల్లో పాల్గొన్న నిడమర్రు మండలంలోని యువకులు, పెద్దమనుషులు బరిప్రాంతాంలోనే లెక్క చూసుకుంటున్నారు. సిండికేట్‌లో పందేలు కాచిన యువకులు మంగళవారం సాయంత్రం తమ లాభనష్టాలు బేరీజు వేసుకుని లెక్కలు తేల్చుకున్నారు. ఖర్చుల కోసం కొంత మినహాయించి మిగతా సొమ్ము ను లాభంగా పంచుకున్నారు. నిడమర్రుకు చెందిన ఓ యువకుడు తాను రూ.25 వేలు తెచ్చానని మొదటి రోజు 5 వేలు లాభం, రెండో రోజు రూ.10 వేలు నష్టం వచ్చిన, ఆఖరిరోజు 2500 లాభం వచ్చినదని చెబుతూ లాభనష్టాలు అంచనా వేసుకుంటున్నాడు.

కొంప ముంచిన గుండాట !

జంగారెడ్డిగూడెం : ఖరీదైన జూదాలలో గుండాట ఒకటి. ఈ ఆటతో పందెం రాయుళ్ల జేబులు ఖాళీ అయ్యాయి. క్షణాల్లో డబ్బులు వచ్చాయో..పోయాయో తెలిసే ఈ జూదంలో ఎంతోమంది లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నారు. ప్రధానంగా కోడి పందేలు నిర్వహించే ప్రతీచోటా కూడా గుండాట, పేకాట, నంబరు ఆటలను నిర్వహించారు. కోడి పందేలకు వచ్చిన వారంతా అటు కోడి పందేలను చూస్తూ, బెట్టింగ్‌లు వేసుకుంటూనే గుండాటలను కూడా ఆడడంతో నష్టపోయామని చెబుతున్నారు. ఆయా ప్రాంతాల్లో మొబైల్ మద్యం బెల్ట్‌షాపుల సౌకర్యం ఉండడంతో మద్యం తాగి మత్తుతో పందేలు వేశారు. కోడి పందేల వద్ద గుండాట ఏర్పాటు చేసేందుకు పందేల నిర్వాహకులు పోలీసులకు మామూళ్ల పేరుతో సుమారు రూ.3లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్టు సమాచారం.







గుర్వాయిగూడెంలో కోడిపందేలు ప్రారంభిస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు, చొదిమెళ్ల కోడి పందేలలో మహిళ, జీలుగుమిల్లిలో కోడి పందేలు



చొదిమెళ్లలో జూదం



కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల నిరసన

అంగన్‌వాడీల వినూత్న నిరసన

- జగన్‌కు సాష్టాంగ నమస్కారాలు

ఏలూరు కలెక్టరేట్, జనవరి 16: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న అంగన్‌వాడీల సమ్మె 36వ రోజుకు చేరింది. కనుమ పండుగ సందర్భంగా కలెక్టరేట్ వద్ద మంగళవారం జగనన్నకు సాష్టాంగ నమస్కారాలు చేసి వినూత్నంగా నిరసన తెలిపారు. సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వీరంకి సాయిబాబు, యూనియన్ నాయకురాలు స్వప్న మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీలను పండుగ రోజు కూడా రోడ్డుమీద పడేసిన పాపం జగన్‌దే అన్నారు. అంగన్‌వాడీలకు విధుల్లో చేరాలని లేకుంటే వారి ఉద్యోగాలు తీసేస్తామని నోటీసులు ఇస్తూ బెదిరించడం దుర్మార్గమన్నారు. సమస్యలు పరిష్కరించకుండా తాత్సారం చేయడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు జి.విజయలక్ష్మి, అంగన్‌వాడీ నాయకులు టి.రజిని, రామలక్ష్మి, చిలకమ్మ, శారద, మేరి, లత, గాయత్రి, దేవిరాణి, సీఐటీయూ నగర అధ్యక్షుడు బి.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తల్లుడికి 260 వంటకాలు

సంక్రాంతి పండుగ పురస్కరించుకుని జంగారెడ్డిగూడెంలో కొత్త అల్లుడికి 260 రకాల తినుబండారాలతో విందు ఏర్పాటు చేశారు. జంగారెడ్డిగూడెంకు చెందిన మహంకాళి శ్రీనివాసరావు, మాధురిలత కుమార్తె నాగ పవనసింధూకు తల్లాడకు చెందిన గుర్రం సాయిచరణ్‌కు ఇచ్చి 2023 నవంబరులో వివాహం చేశారు. సంక్రాంతి సందర్భంగా అత్తింటికి వచ్చిన కొత్తఅల్లుడు, కుమార్తెకు అత్తమామలు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 260 రకాల వంటలు చేసి భోజనం ఏర్పాటుచేశారు.

- జంగారెడ్డిగూడెం

ఆక్వా రైతులకు ఆక్సిజన్!



- చంద్రబాబు ప్రకటనతో ఆశలు
- మేతల ధరలు, మద్దతు ధర, సాగు ప్రోత్సాహంపై నూతనోత్సాహం
- సంక్షోభానికి తెరపడుతుందని ఆనందం

7



అట్టహాసంగా శ్రీవారి పార్వేట ఉత్సవం

7



రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలో తలపడుతున్న జట్లు

దేశానికి యువతే కీలకం

» ఉత్సాహంగా సంక్రాంతి యువజనోత్సవాలు

ఆకివీడు, జనవరి 16: డీవైఎఫ్ఐ సంక్రాంతి యువజనోత్సవాల్లో భాగంగా బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం రాష్ట్రస్థాయి చెడుగుడు, ఉమ్మడి కృష్ణా-పశ్చిమ గోదావరి జిల్లాల స్థాయి వాలీబాల్, జిల్లాస్థాయి చెస్, పాటల పోటీలు, పట్టణస్థాయి రంగవల్లులు, మ్యూజికల్ ఛైర్స్, కరాటే విన్యాసాలు నిర్వహించారు. ఆహ్వానసంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ, దేశానికి యువతే కీలకమన్నారు. కమిటి కన్వీనర్ డీకల రవితేజ, ఆహ్వాన సంఘం కార్యదర్శి ధనుష్, కోశాధికారి బి.రాంబాబు, కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, జి.రాంబాబు, కింజరాపు శంకర్, సందక సూరిబాబు, బత్తిల పార్వతి, బొక్కా వర్మ, సందక ఉదయకుమారి, డీకల లక్ష్మి, లావణ్య పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో క్రీడాధికారులు

ఖేలో ఇండియా పోటీలకు బాలబాలికల జట్టు ఎంపిక

భీమవరం అర్బన్, జనవరి 16: తమిళనాడులోని తిరుచ్చిలో ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే జాతీయస్థాయి ఖేలో ఇండియా పోటీలకు బాలబాలిక జట్టును ఎంపిక చేశారు. మలఖంబ్ క్రీడకు బాలబాలికల రాష్ట్ర జట్టు ఎంపికను మంగళవారం చింతలపాటి బాపిరాజు స్మారకోన్నత పాఠశాలలో ఏపీ స్పోర్ట్స్ ఆథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పీ సురేంద్ర బాబు, పీ విజయకుమార్, ఎం. శివ, మల్లఖంబ్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీపీసీ శేఖరరాజు పాల్గొన్నారు.

ఎడ్లబండిపై ఊరేగింపుగా అత్తింటికి కొత్తఅల్లుడి

» 29 రాష్ట్రాల నుంచి ప్రత్యేకమైన స్వీట్లు.. భీమవరంలో సరికొత్త ట్రెండ్



ఎడ్లబండిపై వస్తున్న కొత్త అల్లుడు

భీమవరంటౌన్, జనవరి 16 : ఉభయ గోదావరి జిల్లాల్లో ఇటీవలి కాలంలో కొత్త అల్లుడికి సరికొత్తగా ఆహ్వానం పలకడం ఆనవాయితీగా మారుతోంది. ఆషాడం, సంక్రాంతికి వైవిధ్యంగా పండుగ చేయడం సరికొత్త ట్రెండ్‌గా మారింది. భీమవరంలోని వబిలిశెట్టి రామకృష్ణ కుమార్తె లక్ష్మి శిరీష భర్త శిరం నితేష్‌ను ప్రత్యేకంగా అలంకరించిన మూడు ఎడ్లబండ్లపై గంధం వెంకయ్య నాయుడు వీధిలో ఉన్న ఇంటికి సన్నాయిమేళం, నాసిక్ డప్పులు, బాణసంచాతో ఊరేగింపుగా తీసుకు వచ్చారు. ఆ కుటుంబంలోని అల్లుళ్లను కూడా ఎడ్లబండిపై ఊరే గింపుగా తీసుకురావటం విశేషం. సంక్రాంతి రోజున 29 రాష్ట్రాల నుంచి ప్రత్యేకమైన స్వీట్లను తయారుచేయించి వాటిని భారతదేశ పటంలో ఉంచి అల్లుడి అందించడం కొత్త ట్రెండ్‌ను సృష్టించింది. సంక్రాంతికి కొత్త అల్లుడికి అతిథి మర్యాదలకు లోటుండదు.



29 రకాల ప్రత్యేకమైన స్వీట్లు



ప్రధాన మంత్రి జన్‌మన్ కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షిస్తున్న కొండరెడ్లు

కొండరెడ్ల అభివృద్ధికి జన్‌మన్

బుట్టాయగూడెం, జనవరి 16: పశ్చిమ ఏజెన్సీలోని కొండరెడ్లను జన్‌మన్ ద్వారా అభివృద్ధి పరచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు మోటా మినిస్ట్రీ సెక్రటరీ సుశీల్, కెఆర్ పురం ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ తెలిపారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రధాన మంత్రి మోదీ పాల్గొన్న జన్‌మన్ కార్యక్రమాన్ని లైవ్‌లో ప్రచారం చేయగా కొండరెడ్లు డిజిటల్ స్క్రీన్‌పై వీక్షించే ఏర్పాట్లను చేసింది. జన్‌మన్ కొండరెడ్లను అభివృద్ధి పరచేందుకు అమలు చేయడం జరుగుతుందన్నారు. జన్‌మన్‌పై కొండరెడ్ల గ్రామాల్లో పర్యటించి వివరించడం జరిగిందన్నారు. వ్యవసాయం, విద్యుత్, వ్యక్తిగత, గ్రూపు రుణాలు, భూమి అభివృద్ధి తదితర 16 రకాల అంశాలను కొండరెడ్ల అభివృద్ధికి అమలు చేస్తున్నట్లు తెలిపారు.



వృద్ధులతో ముచ్చటిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

వృద్ధ మాతలతో ఎన్‌సీసీ కేడెట్లు

» ఆత్మీయ పలకరింపులతో ఆనందోత్సాహాలు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 16: కన్నబిడ్డలు, కుటుంబ సభ్యుల నిరాదరణకు గురై మాదేపల్లిరోడ్డులోని ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమంలో తలదాచుకుంటున్న 52 మంది వృద్ధ మహిళలకు ఎన్‌సీసీ కేడెట్లు సంక్రాంతి పండుగ రోజు ఆనందోత్సాహాలను పంచి వారిలో మానసికోల్లాసాన్ని నింపారు. 19 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో 350 మంది ఎన్‌సీసీ కేడెట్లు మంగళవారం ప్రేమాలయాన్ని సందర్శించారు. వృద్ధ మాతలను ఆప్యాయంగా పలకరించి పండ్లు, మిఠాయిలు, డ్రింక్‌లను అందజేశారు. క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఎస్.ముఖర్జీ మాట్లాడుతూ, నిరాదరణకు గురవుతున్న వృద్ధులకు ఆత్మీయపలకరింపు ఓ టానిక్‌లా పనిచేస్తుందన్నారు. ఈ నెల 20వరకు క్యాంపు జరుగుతుందని వివరించారు. ప్రేమాలయ నిర్వాహకులు మాట్లాడుతూ, భవన నిర్మాణానికి సినీనటుడు చిరంజీవి కోడలు ఉపాసన రూ.25 లక్షలు అందజేశారని, ఔషధాలను అపోలో హాస్పిటల్స్ ద్వారా అందజేస్తున్నారని వివరించారు. ఎన్‌సీసీ డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ సురేంద్రన్, సుబేదార్ ఆదినారాయణ, ఎన్‌వోలు మౌనిక, శేఖర్, రమ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు ఆక్సిజన్!

టీడీపీ అధినేత చంద్రబాబు ఆక్వారైతుల్లో ఆశలు రేకెత్తించారు. పెరిగిన మేత ధరలు, విద్యుత్ సబ్సిడీలు తగ్గడం, రొయ్యల ధరలు పతనమవడంతో తీవ్ర నిరాశ నిస్పృహల్లో ఉన్న ఆక్వా రైతన్నలకు ఆచంట మహాసభలో చేసిన ప్రకటన ఆక్సిజన్ ఇచ్చింది. ప్రస్తుత పరిస్థితులకు పూర్తి భిన్నంగా అన్నింటికీ సిబ్సిడీలు వర్తింపజేస్తామని చెప్పడం, మేత ధరలు తగ్గిస్తామని, ఆక్వాజోన్‌తో సంబంధం లేకుండా విద్యుత్ యూనిట్ రూ.1.50కు, సబ్సిడీతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు తోడ్పడతామని చెప్పడంతో రైతుల్లో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వారిలో కొత్త ఆశలు చిగురించాయి.



ఆచంట సభలో ప్రకటన చేస్తున్న చంద్రబాబు (ఫైల్), మద్దతు ధర లేని రొయ్యలు

చంద్రబాబు ప్రకటనతో ఆశలు

» మేతల ధరలు, మద్దతు ధర, సాగు ప్రోత్సాహంపై నూతనోత్సాహం
» సంక్షోభానికి తెరపడుతుందని ఆనందం
» జోన్ పేరుతో వైసీపీ దగా..
» ఉమ్మడి పశ్చిమలో 1,80,000 ఎకరాల్లో సాగు

ఆకివీడురూరల్ జనవరి 16: ఉమ్మడిపశ్చిమ గోదావరి జిల్లాలో 1,80,000 ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. అనుమతి పొందని మరో 50వేల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు.చంద్రబాబు హయాంలో ఇచ్చిన ప్రోత్సాహకాలతో జిల్లాలో 2014-2019 మధ్య ఆక్వా సాగువిస్తీర్ణం గణనీయంగా పెరిగింది. సబ్సిడీపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, యూనిట్ కేవలం రూ.1.50కే ఇవ్వడం, నాణ్యమైన సీడ్ లభించడం, ధరలు అదుపులో ఉండటంతో ఆక్వా ద్వారా సుమారు రూ.25 వేల కోట్లు వార్షికాదాయం వచ్చేది. విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఆక్వాసాగు చేస్తున్న వారందరికి యూనిట్ ధర కేవలం రూ.1.50, 40 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కేవలం సబ్సిడీతో రూ.1.10 లక్షలకే ఏర్పాటు చేసేవారు. దీంతో వ్యవసాయాన్ని మార్పు చేసి ఆక్వా సాగువైపు మొగ్గు చూపారు. ఆక్వాసాగుకు అవసరమైన పరికరాలు సబ్సిడీపై అందజేసి ప్రోత్సహించారు.

వైసీపీ పాలనలో ఆక్వా అథోగతే ..

టీడీపీ హయాంలో ఉవ్వెత్తున లేచిన ఆక్వాసాగు వైసీపీ పాలనలో డమాల్ అంది. దీనికి ప్రభుత్వ నిర్ణయాలే కారణమని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్వాజోన్ పేరుతో రైతులకు విద్యుత్ సబ్సిడీని నిలిపివేసిందని, ముందుగా ఐదు ఎకరాలు ఆ తరువాత 10 ఎకరాలకు పెంచుతూ సహేతుకమైన నిర్ణయాలు తీసుకోకపోవడం వలన విద్యుత్ సబ్సిడీ పొందలేక నష్టాల పాలయ్యారు. 40 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రూ.2.43 లక్షలకు పెంచడం .. సబ్సిడీ లేకపోవడం వారిని మరింత ఇబ్బందుల పాల్జేసింది. ధరలు పతనమవుతున్నా, నష్టాల పాలవుతున్నా పట్టించుకోకపోవడంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. మేతలు, మందుల ధరలు విపరీతం గా పెరిగిపోవడం, రొయ్యలు ధరలు తగ్గిపోవడం, వ్యాపారులు సిండికేటై ధరలు తగ్గించేసినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండటంతో ఆక్వారంగం సంక్షోభంలో కూరుకుపోయింది. నష్టాలు తట్టుకో లేక, అప్పులు పాలై రైతులు సుమారు 30వేల ఎకరాలలో సాగు ఆపేసారని సమాచారం. ఉమ్మడి జిల్లాలో సుమారు 21,000 విద్యుత్ కనెక్షన్లు ఉండగా 16,800 కనెక్షన్లకు సబ్సిడీ వర్తిస్తుండగా మరో 4,200 కనెక్షన్లకు సబ్సిడీ లేక ఇబ్బందులు పడుతున్నారు. అతి తక్కువ సమయంలో అధికాదాయం ఆర్జించే ఆక్వారంగం సంక్షోభంలో ఉండటం మిగిలిన అన్ని రంగాలపై ప్రభావంచూపుతోంది. మార్కెట్‌లో అన్ని రంగాలు వ్యాపారాలు లేక వెలవెలబోతున్నాయి. పండుగలు సైతం సాదాసీదాగానే జరిగిపోతున్నాయి. ప్రజల్లో ఇదివరకు ఉన్న హడావుడి, ఆనందోత్సాహాలు లేకుండా పోయాయి.

వైసీపీవి మోసపూరిత వాగ్దానాలు



కోట్లాది రూపాయలు విదేశీయ మారకద్రవ్యం తీసుకువస్తున్న ఆక్వా రైతుల నడ్డిని వైసీపీ ప్రభుత్వం విరిచింది. విద్యుత్ సబ్సిడీని ఎత్తివేయడానికి అనేక సాకులు చూపింది. మోసపూరితమైన వాగ్దానాలతో తీవ్రంగా నష్టపోయారు.
భూపతిరాజు తిమ్మరాజు, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు

సంక్షోభంలో ఆక్వారంగం



ప్రభుత్వఅసంబద్ధ నిర్ణయాలతో ఆక్వారంగం సంక్షోభంలో ఉంది. విద్యుత్ యూనిట్ల విషయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం. విన్నపాలు పట్టించుకున్న నాథుడే లేడు.
-ముత్యాల బుజ్జి, వెస్ట్ గోదావరి ప్రాన్ ఫార్మర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు

గణనీయంగా తగ్గిన సాగు



ప్రభుత్వ నిర్ణయాల వలన సాగును గణనీయంగా తగ్గించేశారు. పెట్టుబడులు కూడా రావడం లేదు. ఆర్థిక స్థోమత లేక లీజుకు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. రొయ్యలసాగు ఆపేసి చేపల వైపు దృష్టి మరలిస్తున్నారు.
-దొరపురెడ్డి కన్నబాబు, ఆక్వారైతు-కోళ్లపర్రు

వ్యాపారులను నియంత్రించే చర్యలు నిల్



వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆక్వారంగం ఘోరంగా తయారైంది. నాణ్యతలేని సీడ్, ఫీడ్, మందులు, ధరలు ఆకాశన్నంటుతుంటే, రొయ్యల ధరలు పతనమై పోయాయి. వ్యాపారులను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడం లేదు.
- మద్రివాడ వెంకట్రావు, ఆక్వారైతు-చినకాపవరం

ప్రాణం పోతే పళ్లెంలోకే..

» పందెంతో పేగు తెంపుకుంటున్న కోడిపుంజు
» రక్తమోడుతూనే రణభూమిలో తొడగొడుతోంది
» మానవానందం కోసం మరణంతో పోరాటం

(ఆంధ్రజ్యోతి - ఏలూరు)



నిద్ర లేపడమే తెలిసిన నన్ను శాశ్వత నిద్రలోకి పంపడమే ధ్యేయంగా పెట్టుకున్న మీకు ఎన్నో సార్లు నామొర వినిపించాలనుకున్నాను. నాది వృథా ప్రయాసేనని మిన్నకుండిపోతున్నాను. నా పిచ్చిగానీ కత్తి కట్టొద్దన్న కోర్టు నిర్ణయానికే విలువ ఇవ్వని మీకు, నోరు లేని నా ప్రాణమో లెక్క! మీ నోళ్లకు ముక్కగా మారడానికే పుట్టానా? అన్నట్లుగా ఉండే మీ ఆలోచన కిలోల లెక్క తూచి మరీ పంచుకుంటున్న నా ప్రాణాన్ని పట్టించుకుంటుందను కోవడం నా భ్రమే. అయినా నా అవేదనను అర్థం చేసుకునేవారి కోసం ప్రతీ ఏటా ఎదురుచూస్తూనే ఉన్నాను. ఒక్కరికైనా అర్థమవుతుందని వెతుకుతున్నాను. తృణ ప్రాయంగా నా ప్రాణాన్ని మట్టిలో కలుపుతున్న మిమ్మల్ని ఒక్కసారి ప్రశ్నించాలని నోరు తెరుస్తున్నాను.

మీకు అల్పాహారంలో నేనే కావాలి.. మధ్యాహ్న భోజనంలో నా శరీరమే కావాలి, చివరకు నిద్రపోయే ముందు కూడా నేనే తోడై ఉండాలి. మీకు ఆకలి గుర్తొచ్చినపుడల్లా.. మధువు పెదవి దాటినప్పుడల్లా నా ఆయువును హరిస్తూనే ఉన్నా. ప్రత్యేకంగా పండుగ పేరుతో శారీరకంగా నన్ను ఛిద్రం చేసి మరీ హింసించడంలో ఉన్న ఆనందమేమిటో అర్థం కావడంలేదు. పేగు తెగి బరిలో వేలాడుతున్నా.. నీ పందేనికే కట్టుబడి పోరాడే నన్ను, చీలిన నా పొత్తి కడుపును చూస్తూ మీరు కొట్టే చప్పట్లు, ఈలలు ఒడిగట్టే నా ప్రాణాన్ని హేళన చేస్తున్నాయి. ప్రాణమిస్తూ కూడా మీ నుంచి గౌరవాన్ని కూడా పొందలేని నా జీవితంపై నాకే అసహ్యం పుడుతోంది. ఏం చేస్తే నాపై మీకు కనికరం కలుగుతుందో తెలుసుకోవాలన్న నా ఆవేదన అరణ్య రోదనే అవుతోంది. ప్రాణం పోతే పళ్లెంలోకి.. నిలబడితే మరోమారు బరిలోకి తోస్తూ జేబులు నింపుకునే మీ ప్రవర్తనను ఛీ కొట్టలేని నా కర్మను, నా బతుకుపై నేనే చీదరగా మార్చుకుంటున్నాను.

నా జాతితోనే నన్ను పోరాడమంటూ బరిలోకి తోస్తూ.. జాతి మూకుమ్మడి హత్యలకు నన్నే మూల కారకుడ్ని చేస్తున్న మీ కర్కశత్వానికి నా అశ్రుతాంజాలి సమర్పిస్తున్నాను. కీటకాలతో కడుపు నింపుకుంటూ.. మీ ఇంటి చుట్టూ పిల్లలతో తిరుగాడుతూ.. పాము,పుట్ర వస్తే అడ్డుకునే మాకు ఆస్తి కోసం అన్నదమ్ములతో, తల్లిదండ్రులతో పగను పెంచుకునేంత జీవితాన్ని ఆ దేవుడు ఇవ్వలేదు. అలాంటి మాపై ఇంతటి ఆగ్రహం ఎందుకు ప్రదర్శిస్తున్నారో తెలుసుకోవాలనుంది. అంతో ఇంతో ప్రేముండబట్టే నోరు లేకపోయినా మా జాతిని కాపాడుకోవడానికి మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను. కత్తులు చేతపట్టించి బరిలోకి తోసి మీలో మీరు కొట్టుకు ఛావమన్న క్షత్రియ కాలాన్ని గుర్తు చేసుకుంటూ మీ ప్రాణాలకు బదులు మా గొంతుకలను పణంగా పెడుతూ వికటాట్టహాసం చేసే ఈ ప్రవర్తనను ఏ కోడీ హర్షించలేక పోతుంది. ఇదేం బతుకు దేవుడా అని ఆ భగవంతున్ని వేడుకునే లోపే బలిపేరిట ఆయనకూ నన్ను ప్రసాదం చేస్తున్నారు. మీ కోర్కెలకు పావుగా ఉపయోగించుకుంటున్న ఓ మనిషీ నాదీ ప్రాణమేనని గుర్తుంచుకోవయ్యా! ఏం చేస్తే గుర్తిస్తావో పోనీ చెప్పవయ్యా! దశాబ్దాల నా బలిదానం నీ మనసును కరిగించకపోయినా నీ బిడ్డల మనసునైనా కరిగిస్తే దుర్భర బతుకు నుంచి మా జాతికి భవిష్యత్తులోనైనా రక్షణ దొరుకుతుందన్న ఆశతో నీ పందెంలో బలిపీఠమెక్కుతాను.

మూగగా చూస్తూ మా శవాల్ని మోస్తున్న బరులైనా మా ఆర్తనాదాల్ని వింటే ఎంత బావుణ్ను! మేము మీకు సహకరించబోమంటూ పందెం రాయుళ్లకు అడ్డం తిరిగితే మా ప్రాణాలు నిలుస్తాయి కదా! వేదన భ్రమే కానీ.. మనసున్న మనిషే కరగనంటుంటే భారం మోసే భూ మాత ఎలా వినగలదు? కోడి సగటు జీవిత కాలం ఎంతో కూడా తెలియని పందెం రాయుళ్లు కొలతలు వేసి మరీ బరులు సిద్ధం చేస్తూ పండుగను మాకు మరణ వేదిక చేస్తూ బరుల్ని స్వర్గపురిగా మారుస్తున్నారు. చేతికి కత్తి గుచ్చుకుంటే అమ్మా.. అని పిలిచే భాగ్యం లేని మాపై కాస్త కనికరం చూపించాలన్న ఈ అభ్యర్థనను ఒక్క క్షణం ఆలోచించినా వేల సంఖ్యలో మా జాతి ఊపిరి పీల్చుకుంటుందని మర్చిపోకండి. ఒక్క నిమిషం ఆలోచించండి.

సబ్ కలెక్టర్, డీఎస్పీ దాడి చేసినా..

జోరుగా కోడిపందేలు, జూదం

పెనుమంట్ర, జనవరి 16 : మండలంలో నెగ్గిపూడి, మార్టేరు, ఆలమూరు గరువు, నత్త రామేశ్వరం గ్రామాల్లో కోడిపందేలు, జూదం జోరుగా సాగాయి. గరువు కోడిపందేల స్థావరంపై నరసాపురం సబ్ కలెక్టర్, డీఎస్పీ మనోహరాచారి సిబ్బందితో మంగళవారం దాడులు చేసి నిలుపుదల చేశారు. నలుగురు వ్యక్తుల్ని, రెండు కోడి పుంజులు, గుండాట బోర్డులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం యథావిధిగా పందేలు, గుండాటలు సాగాయి. ఫ్లడ్ లైట్లు వెలుగులో మూడు రోజులు పందేలు, పేకాట, గుండాట, కోత ఆటలు విచ్చలవిడిగా జరిగాయి. బరితెగించి మరీ పందెంరాయుళ్ల పందేలు, జూదం నిర్వహిస్తే పోలీస్ అధికారులు పత్తా లేకుండా పోయారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోట్లాది రూపాయలు చేతులు మారాయి. దీంతో కొందరు జేబులు ఖాళీ చేసుకొని తిరిగి సొంత ఊళ్లకు ప్రయాణమై వెళ్లారు.

కోజాల మాంసానికి యమ డిమాండ్

పందెంలో ఓడిపోయిన కోడిని కోజాగా పిలుస్తారు. దీని మాంసానికి మార్కెట్లో డిమాండ్ పెరిగింది. కేజీ రూ.1,500 నుంచి రెండు వేలు పలికింది. పందెం కోళ్లను బాదం పిస్తా , కైమా వంటి పోషక ఆహారాన్ని పెట్టి పందేలకు సిద్ధం చేస్తారు. దీంతో అధిక ప్రోటీన్లు ఉన్న కోజాకు డిమాండ్ పెరిగింది.



దొరసానిపాడులో ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

అట్టహాసంగా శ్రీవారి పార్వేటి ఉత్సవం

» దొరసానిపాడు కనుమ మండపంలో విశేష పూజలు

ద్వారకాతిరుమల, జనవరి 16: చిన్నతిరుమలేశుని పార్వేటి మహోత్సవం (కనుమఉత్సవం) భక్తుల గోవిందనామస్మరణలు, అర్చకుల వేదమంత్రోచ్చరణలు, కేరళ వాయిద్యాలు, డోలు, సన్నాయి, చిత్రవిచిత్రవేషధారణల నడుమ మంగళవారం సాయంత్రం అట్టహాసంగా జరిగింది. ఉభయదేవేరులతో శ్రీవారిని రాజాధిరాజ వాహనంపై ఉంచి ప్రధాన రాజగోపురం మీదుగా గజ, అశ్వసేవల నడుమ పురవీధులకు పయనమై దొరసానిపాడుకు తరలివెళ్లారు. మహిళలు స్వామి వాహనం వచ్చే దారిపొడవునా రంగవల్లులతో తీర్చిదిద్దారు.

ఉత్సవ వైభోగం ఇలా.. శ్రీవారి క్షేత్రం నుంచి ఊరేగింపుగా వెళ్లిన స్వామివారు అక్కడి కనుమమండపం వద్ద భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదేవేరులతో శ్రీవారిని ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలను నైవేద్యం చేశారు. భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం శ్రీవారు గిరిప్రదక్షిణగా శేషాచలకొండ మార్గాన తిరుగుతూ అట్టహాసంగా ఆలయానికి చేరుకున్నారు. ప్రతిఏటా శ్రీవారు కనుమ పండుగ రోజు మాత్రమే క్షేత్రాన్ని విడిచి పొరుగు గ్రామానికి వెళ్లడం ఇక్కడి విశిష్టత.



స్వామికోసం దొరసాని పాడులో ఎదురుచూపు

శ్రీవారి క్షేత్రం నుంచి మేళతాళాలు.. శక్తి వేషాలతో..

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

పోలవరం, జనవరి 16 : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన పట్టిసీమ గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. వివరాలివి. కొత్తపట్టిసీమకు చెందిన మజ్జి శ్రీనివాస్ (41) తన తల్లి దైవశిరోమణితో కలిసి తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం రాంపాలెం బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా పట్టిసీమ-కొత్తపట్టిసీమ గ్రామాల మధ్య ఎదురుగా వచ్చి మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి దైవశిరోమణి, మరో ద్విచక్రవాహనదారుడైన ఉస్సే కిరణ్ కుమార్ తీవ్రంగా గాయపడడంతో స్థానికులు వారిని 108లో మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం తరలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కేస్తున్నట్టు పేర్కొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

» ఎంపీటీసీ ఇంటి వద్ద మృతుడి బంధువుల ఆందోళన



మృతదేహంతో ఎంపీటీసీ ఇంటి వద్ద నిరసన తెలుపుతున్న మృతుడి బంధువులు



ఫణీంద్ర (ఫైల్)

కలిదిండి, జనవరి 16 : కొండంగి గ్రామానికి చెందిన కోకా ఫణీంద్ర (27) రొయ్యల చెరువుల వద్ద ఉన్న పాకలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు, మృతుడి బంధువుల కథనం ప్రకారం తన సోదరుడి కుమార్తెతో మృతుడు చనువుగా ఉండటంతో ఎంపీటీసీ ఇమ్మానేని లక్ష్మణరావు ఫణీంద్రను హత్య చేయించాడంటూ మంగళవారం కొండంగిలో ఎంపీటీసీ నివాసం వద్ద మృతుడి బంధువులు ఫణీంద్ర మృతదేహంతో ఆందోళన చేశారు. ఎంపీటీసీ ఇంటిని, కారును ధ్వంసం చేసి ఎంపీటీసీని అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఎంపీటీసీ లక్ష్మణరావును అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కైకలూరు సీఐ కృష్ణకుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కలిదిండి ఎస్ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి దుర్మరణం

భీమవరం క్రైం, జనవరి 16 : సిమెంట్, కంకర లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ మంగళవారం తిరగబడటంతో డ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వివరాలివి. చినఅమిరంకు చెందిన పేరుకుల నాగ సత్యనారాయణ (36) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ట్రాక్టర్‌పై సిమెంట్, కంకర వేసుకుని వెళ్తుండగా మార్గమధ్యంలో ట్రాక్టర్ అదుపు తప్పి చెట్టును ఢీకొని డ్రెయిన్‌లోకి దూసుకెళ్లి తిరగబడింది. ట్రాక్టర్ కిందపడి సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సీఐ జి. శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిశు గృహంలో నెలల చిన్నారి మృతి

ఏలూరు క్రైం, జనవరి 16 : నగరంలోని విద్యానగర్ శిశుగృహంలో నెలల శిశువు షాలిని మృతి చెందింది. ఈ ఘటనపై శిశుగృహ మేనేజర్ భార్గవి త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందించడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ శిశువు తల్లిదండ్రులు అనారోగ్యంగా ఉండడంతో చిన్నారిని శిశు గృహంకు అప్పగించారు. అనారోగ్యం కారణం వల్లే ఆ శిశువు మరణించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. శిశువుకు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మంగళవారం రాత్రి శవపంచనామా పోలీసులు నిర్వహించారు.

పేకాట, గుండాటపై దాడి

» పోలీసుల అదుపులో 32 మంది.. రూ.27 వేలు స్వాధీనం


పాలకోడేరు, జనవరి 16 : మండలంలో తొమ్మిది గ్రామాల్లో కోడిపందేలు, పేకాట, గుండాటలపై దాడి చేసి 32 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఆరు కోళ్లు, ఆరు కత్తులతో పాటు రూ.27,500 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు స్టేషన్ రైటర్ హజరయ్య తెలిపారు. పాలకోడేరు, గొల్లలకోడేరు, గరగపర్రు, కోరుకొల్లు, మోగల్లు, వేంద్ర, శృంగవృక్షం, పెన్నాడ, విస్సాకోడేరు గ్రామాల్లో పందేలపై దాడి చేశామని పోలీసులు చెప్పారు.

భర్త కొట్టాడని.. వివాహిత ఆత్మహత్య

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 16: మద్యం మత్తులో భార్యను కొట్టడంతో మనస్థాపంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పడాలలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలివి. పడాలకు చెందిన ఉడుమూడి జేమ్స్‌కు, కొమ్ముగూడెంకు చెందిన నాగమణి (20)తో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొంత కాలంగా జేమ్స్ మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడుతూ ఉండేవాడు. ఆదివారం జేమ్స్ మద్యం తాగి ఇంటికి వచ్చాడు. భార్యతో గొడవపడ్డాడు. భార్యను కొట్టడంతో మనస్థాపంతో ఇంట్లోకి వెళ్లి దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన జేమ్స్ స్థానికుల సాయంతో తలుపులు పగలకొట్టారు. దూలానికి వేలాడుతున్న నాగమణిని కిందకు దించారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఆమెకు ఆర్ఎంపీ సాయంతో ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం 108కు సమాచారం అందించారు. వాహనం వచ్చేలోపు నాగమణి మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేరుపాలెం బీచ్‌లో యువకులపై దాడి

మొగల్తూరు, జనవరి 16: మద్యంమత్తులో తెలంగాణ యువకులు గోదావరి జిల్లా యువకులపై దాడికి పాల్పడ్డ ఘటన పేరుపాలెం బీచ్‌లో సోమవారం రాత్రి జరిగింది. తూర్పు గోదావరి జిల్లా కోనసీమకు చెందిన గణేశ్ నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాలివి. మూడు వాహనాల్లో పేరుపాలెం సముద్రం వద్దకు తెలంగాణ యువకులు వచ్చారు. ఎంజాయ్ చేసి తిరిగి వెళ్తూ రోడ్డుకు అడ్డంగా కార్లు నిలిపారు. వెనుక వస్తున్న కోనసీమ జిల్లా యువకులు కార్లు అడ్డంతీయమని అడగ్గా వారిపై రాడ్లతో దాడికి దిగారు. ఈ ఘటనలో గణేశ్‌తో పాటు మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అక్కడికి రాగానే తెలంగాణ యువకులు ఓ కారును విడిచి మరో రెండు కార్లలో ఉడాయించారు. క్షతగాత్రులను నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్స పొందుతున్న గణేశ్

కర్రతో దాడి.. ఒకరి మృతి

» స్నేహితుల మధ్య వివాదం-నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఏలూరు క్రైం, జనవరి 16 : స్నేహితుల మధ్య తలెత్తిన వివాదంతో ఓ వ్యక్తి మరో వ్యక్తి తలపై కర్రతో కొట్టడంతో తీవ్ర గాయాలకు గురై మృతి చెందాడు. ఈ ఘటనలో హంతకుడిని 24 గంటలు గడవకముందే పోలీసులు అరెస్టు చేశారు. వివరాలివి. ఏలూరు హనుమాన్‌నగర్‌కు చెందిన లక్కోజు సురేష్ (43) టైలరింగ్ చేస్తాడు. పదేళ్ల క్రితం భార్య బిడ్డలను వదిలివేసి ఒంటరిగా ఉంటున్నాడు. అతడికి అమీనాపేటనకు చెందిన కైతేపల్లి వంశీకుమార్ స్నేహితుడు. వీరిద్దరు కలిసి ఈనెల 14వ తేదీ అర్ధరాత్రి వంశీ కుమార్ ఇంట్లో భోజనం చేశారు. ఇద్దరి మధ్య చిన్న వివాదంతో వాగ్వాదం జరిగింది. ఘర్షణ పడ్డారు. వంశీకుమార్ తల్లిని సురేష్ దుర్భాషలాడాడు. 15వ తేదీ ఉదయం ఐదు గంటల సమయంలో అక్కడ నుంచి సురేష్ వెళ్తుండగా వెనుక నుంచి కర్ర తీసుకువచ్చిన అతడి తలపై బలంగా కొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వంశీ కుమార్ అక్కడ నుంచి పారిపోయాడు. ఈ ఘటనపై త్రీ టౌన్ సీఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేయగా డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. ఘటనా స్థలాన్ని పోలీసు జాగిలాలతో, క్లూస్ టీమ్‌తో పరిశీలించారు. ఈ హత్య వంశీకుమారే చేశాడని నిర్ధారణకు వచ్చి మంగళవారం ఉదయం అతడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. సీఐ ను, ఎస్ఐలు ఎస్కె మదీనాబాషా, అజయ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుళ్ల ఓం ప్రకాష్, ఏసు, కానిస్టేబుళ్ల ఇస్సాకు, హేమసుందర్, రాజేంద్ర ప్రసాద్‌ను డీఎస్పీ అభినందించారు. త్రి టౌన్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు.


పెదవేగి మండలంలో హోరాహోరి కోడిపందెం


టి.నరసాపురం మండలంలో బరి వద్ద రద్దీ


పెదపాడు మండలంలో కోడి పందేలకు సన్నద్ధం


ఏలూరు తంగెళ్లమూడిలో కోడిపందెం బరి

కోడ్ఢీ

• జోరుగా కోడిపందేలు, పేకాట, గుండాట • మద్యం విక్రయాలు • పట్టించుకోని అధికారులు

జిల్లాలో సంక్రాంతి మూడు రోజులూ కోడి పందేలు, జూదం యథేచ్ఛగా జరిగాయి. పట్టణాలు గ్రామాల్లో సైతం కోడి పందేల బరులు ఏర్పాటు చేశారు. బరుల వద్ద పేకాట, గుండాట నిర్వహించారు. యువకులతో పాటు మహిళలు, పిల్లలు సైతం జూదమాడారు. మద్యం ఏరులైపారింది. సంక్రాంతి పండుగకు కోడిపందేలు, జూదం నిర్వహించినా ఆడినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించిన అధికారులు అడ్రస్ లేరు. కత్తి కట్టి కాలుదువ్విన కోడి రక్తమోడింది. పందెగాళ్లు పోయిన, వచ్చిన మొత్తం లెక్కల్లో మునిగితేలారు.



జంగారెడ్డిగూడెం, జనవరి 16: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందేలు యథేచ్ఛగా సాగాయి. మండలంలోని లక్కవరం, పేరంపేట, పంగిడిగూడెం, శ్రీనివాసపురం, పేరంపేట, పట్టణంలోని సుబ్బంపేట, బుట్టాయగూడెం బైపాస్ రోడ్డులోని చెరువు వెనుక మూడు రోజుల పాటు పందేలు యథేచ్ఛగా సాగాయి. ప్రతీ గ్రామంలో పందేలను వేశారు. శ్రీనివాసపురం, రామానుజపురం, బుట్టాయిగూడెం పందేల వద్ద రద్దీ ఎక్కువ ఉంది.

● ఏలూరు రూరల్: మండలంలో మూడు రోజుల పాటు బరిలో కోడి దుమ్ము రేపి రక్తం కార్చింది. అధికారపార్టీ నేతలు పోటాపోటీగా శిబిరాలు నిర్వహించగా మరోవైపు పోలీసులు, రెవెన్యూ అధికారులు సమర్థంగా కోడి పందేలు అడ్డుకున్నామని కాకిలెక్కలు చెబుతున్నారు. బరుల వద్ద మద్యం బహిరంగ విక్రయాలు సాగినా అధికారులు కన్నెత్తి చూడలేదు.

● పెదపాడు: పండుగ సంప్రదాయం పేరుతో గ్రామాల్లో నిర్వహించిన కోడిపందేలు, జూదంలో లక్షలాది రూపాయలు చేతులు మారింది కత్తి కట్టి కాలు దూసిన కోడి రక్తమోడుతూ నేలకొరిగాయి. కోడిపందేలు, పేకాట యథేచ్ఛగా సాగాయి. పాఠశాల విద్యార్థులు సైతం జూదంలో పాల్గొనడం ఆశ్చర్యం.

● పెదవేగి: మండలంలో మూడు రోజులపాటు కోడిపందేలు జోరుగా సాగాయి. కోట్లు చేతులు మారాయి. పెదవేగి, లక్ష్మీపురం, వేగివాడ, తాళ్ళగోకవరం, కూచింపూడి, కవ్వగుంట, జగన్నాధపురం, విజయరాయి, భోగాపురం, కొండలరావుపాలెం గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించారు. కొండలరావుపాలెం, కూచింపూడి గ్రామాల్లో భారీ సెట్టింగుల మధ్య కోడిపందేలు నిర్వహించారు. కొండలరావుపాలెంలో సోమవారం ముసుగు పందేలు మూడు వేశారు. పెదకడిమి సొసైటీ అధ్యక్షుడు చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు బుల్లెట్ వాహనాన్ని గెలుచుకున్నారు. పందేల బరి వద్ద కోసాట, గుండాట, పేకాట భారీఎత్తున జరిగింది. బరుల వద్దే మద్యం బహిరంగంగా విక్రయించారు.

● టి.నరసాపురం: మండలంలోని టి.నరసాపురం, బందంచర్ల, తిరుమలదేవిపేట, అప్పలరాజుగూడెం, బండివారిగూడెం గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించారు. లక్షలాది రూపాయలు చేతులు మారాయి. యువత కోడిపందేలు, పేక, గుండాట వద్ద గుమిగూడారు. మహిళలు కూడా గుండాటలో ఉన్నారు. వెలగపాడు పంచాయతీ వీరభద్రవరంలో కోడిపందేలు ఆడుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సురేంద్రకుమార్ తెలిపారు. తిరుమలదేవిపేటలో గుండాట నిర్వహిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వెలగపాడులో సారా విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

● కుక్కునూరు: మండలంలో కోడిపందేలు మూడు రోజులపాటు జోరుగా సాగాయి. కుక్కునూరు, చీరవల్లి, వేలేరులో కోడిపందేలకు జనం తరలివచ్చారు. పేకాట, గుండాట, యథేచ్ఛగా సాగాయి. మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. వేలేరులో పందేలకు తెలంగాణ ప్రాంతం నుంచి తరలివచ్చారు.

● పోలవరం: మండలంలో ఎల్ఎన్‌డీపేట, గుంజవరం, పట్టిసీమ, కొత్తపట్టిసీమ, గూటాల గ్రామాలలో కోడి పందేలు జోరుగా సాగాయి. కోసాట, గుండాట, పేకాట జూదాలు ముమ్మరంగా కొనసాగాయి. బరుల వద్ద మద్యం అమ్మకాలు జోరుగా కొనసాగాయి.

● ద్వారకా తిరుమల: దొరసానిపాడులో ఫ్లడ్‌లైట్ల వెలుగులో కోడిపందేలు, జూదం, గుండాట, మద్యం, మాంసం విక్రయాలు యథేచ్ఛగా జరిగాయి. లక్షలాది రూపాయలు చేతులు మారాయి. ద్వారకాతిరుమల, దేవినేనివారిగూడెం, ఐఎస్.జగన్నాథపురం, ఎం.నాగులపల్లి, పికన్నాపురం, తిరుమలంపాలెం, తిమ్మాపురంలో పందేలతోపాటు గుండాట, మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి.

● చింతలపూడి: మండలంలో రాఘవాపురం వద్ద జరిగిన కోడి పందేల్లో కోసాట, గుండాట, పందేలకు మూడు బరులు ఏర్పాటుచేశారు. చింతంపల్లిలో భారీగా పందేలు నిర్వహించారు. తెలంగాణ సరిహద్దులో ఉండడంతో అధిక సంఖ్యలో తెలంగాణ నుంచి పందెపురాయుళ్ళు తరలివచ్చారు. చింతలపూడి, రేచర్ల, ప్రగడవరంలో పందేలు విచ్చలవిడిగా నిర్వహించారు.

● ఉంగుటూరు: మండలంలో ఉంగుటూరు, నారాయణపురం, కైకరం, గొల్లగూడెం, రాచూరు, బాదంపూడి గ్రామాలలో మూడు రోజుల పాటు యథేచ్ఛగా కోడి పందేలు, జూదం నిర్వహించారు.

● కొయ్యలగూడెం: మండలంలోని రామానుజపురంలో భారీ ఎత్తున కోడిపందేలు నిర్వహించారు. పొరుగు రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చి పందేలు వీక్షించారు. మహిళలు కూడా పందెలు చూడటానికి ఎగబడ్డారు. బెంగళూరు, విశాఖపట్నం, హైదరాబాద్ నగరాల నుంచి ప్రముఖులు వ్యాపారవేత్తలు కోడిపందేలు చూడడానికి వచ్చారు. కోడిపందేలతో పాటు గుండాట, పేకాట జోరుగా సాగాయి. దిప్పకాయలపాడు, గవరవరం, పొంగుటూరు, రాజవరం, బయ్యన్నగూడెం గ్రామాల్లో కోడిపందేలు జోరుగా జరిగాయి.

● జీలుగుమిల్లి: మండలంలో కామయ్యపాలెంలో జరిగిన పందేల వద్ద పందెం రాయుళ్లు బరి తెగించారు. ఒక్కో పందేం రూ. లక్ష వరకు సాగింది. బరుల వద్ద టెంట్‌లు, లైటింగ్, ఇతర ఏర్పాట్లు చేశారు. తెలంగాణ ప్రాంతం అశ్వారావుపేట, సమీప గ్రామాల ప్రజలు కామయ్యపాలెం పందేల వద్దకు వచ్చి లక్షల్లో పందేలు కాశారు. వేగివాడ, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం మండలాల నుంచి పందెంరాయుళ్లు వచ్చారు.

● నిడమర్రు: మండలంలో భువనపల్లి, పెదనింద్రకొలను, తోకలపల్లి, ఛానమిల్లి, బావాయిపాలెం గ్రామాలలో కోడిపందేలు జోరుగా జరిగాయి. గుండాట, కోతాట యథేచ్ఛగా సాగింది. మహిళలు కూడా గ్యాలరీలలో కూర్చుని కోడిపందేలు వీక్షించారు. నలుగులు ఐదుగురు మహిళలు జట్టుగా ఏర్పడి తలో 10 వేలు తెచ్చి సిండికేట్‌గా పందేలు కాశారు. రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు ఈ పందేలలో పాల్గొనడం విశేషం.






జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం, పోలవరం మండలాల్లో గుండాట జోరు, పెదవేగి మండలం కొండలరావుపాలెంలో కోతాట, కోడి కాలికి కత్తి కడుతున్న పందెగాళ్లు


అమ్మవారికి సారె తీసుకువెళుతున్న మహిళలు

జనార్దనుడి ఆలయంలో కనుమ ఉత్సవం

ఏలూరుకార్పొరేషన్, జనవరి 16: అగ్రహారంలోని జనార్దనస్వామి ఆలయంలో కనుమ ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గోపూజ చేశారు. మహిళలు అమ్మవారికి పలు రకాల సారె అప్పగించారు. అమ్మవారికి, స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు పవన కుమారాచార్యులు, వెంకటాచార్యులు భక్తులతో పూజలు చేయించారు.

తూర్పువీధిలోని రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి రథోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. అమ్మవార్లను, స్వామివారిని మేళతాళాలు, బాజాభజంత్రీలు, విచిత్ర వేషాలతో ఊరేగించారు. వీధివీధిన స్వామివారికి భక్తులు హారతులు ఇచ్చిమొక్కుబడులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● కామవరపుకోట : శ్రీలక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠంలో మంగళవారం కనుమ ఉత్సవాన్ని నిర్వహించారు. స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పీఠాన్ని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కూచిపూడి నృత్య ప్రదర్శన

ఏలూరు కార్పొరేషన్, జనవరి 16 : ఆర్‌ఆర్ పేట వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం కళావేదికపై పార్వతీ రామచంద్రన్ శిష్య బృందం కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. కపిలేశ్వరపురానికి చెందిన నేమాని నాగలక్ష్మి శ్రీనివాస కళ్యాణం హరికథ వినిపించారు. తొలుత స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, విష్ణు సహస్రనామ పారాయణ, భగవద్గీత పఠన నిర్వహించారు. శ్రీవారి నృత్య కళ్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ అర్చకులు కోసూరి సత్యనారాయణ బృందం భక్తులతో పూజలు చేయించారు. ఆలయ ఈవో నాగసన్యాసిరావు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ తోలేటి శ్రీనివాస్‌లు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

ఆలయాల్లో పూర్వాభాద్ర పూజలు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 16: సత్రంపాడు అంబికాదేవి ఆలయ ప్రాంగణంలోని వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం పూర్వాభాద్ర నక్షత్రం నేపథ్యంలో స్వామివారికి ఆలయ అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ పంచామృతాభిషేకం చేశారు. అనంతరం విశేష అలంకరణ నిర్వహించి ప్రత్యేక హారతులు ఇచ్చి నివేదనలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అంబికా కుటుంబ సభ్యులు స్వామివారికి సింధూరం, తమలపాకులతో పూజించారు. కోటదిబ్బ గణపతి త్రిదేవి పీఠం ప్రాంగణంలో ఆంజనేయస్వామి ఆలయంలో సామూహిక హనుమాన్‌చాలీసా పారాయణ చేశారు. పాండురంగ థియేటర్ సెంటర్ దాసాంజనేయ స్వామి ఆలయంలో అన్న సమారాధన చేశారు. అగ్రహారం, వన్‌టౌన్, పవరుపేట, రామచంద్రరావుపేట, పత్తేబాద, తదితర ప్రాంతాల్లో ఆంజనేయస్వామి మందిరాల వద్ద భక్తులు పూజలు చేశారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

ఏలూరు కల్చరల్, జనవరి 16: చాటపర్రు జనార్దనస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. తొలుత స్వామి అమ్మవారిని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ వేదపండితులు మంత్రోచ్ఛరణలతో ప్రాంగణం వద్దకు తోడ్కొని వచ్చారు. గోదాదేవి కల్యాణాన్ని వేద పండితులు, అర్చకులు వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సూత్రధారణ, తలంబ్రాలతో గోదారంగనాథుని కల్యాణం రమణీయంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రఘురామ్ పర్యవేక్షించారు.

చేతి వృత్తిదారులను ఆదుకోవాలి

ఏలూరు టూటౌన్, జనవరి 16: చేతివృత్తిదారులకు జనాభా ప్రాతిపాదికన నిధులు కేటాయించి ఆదుకోవాలని ఏపీ చేతివృత్తిదారుల సమన్వయ కమిటి జిల్లా కన్వీనర్ పి.ఆదిశేషు డిమాండ్ చేశారు. జడ్పీ క్యాంపు కార్యాలయంలో వృత్తిదారుల క్యాలెండర్‌ను జడ్పీ ఛైర్మన్ గంటా పద్మశ్రీప్రసాద్ ఆవిష్కరించారు. లక్కోజు అనిల్ ఆచార్య, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విఠల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఏసురాజు, లక్ష్మీనారాయణ, రాంబాబు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అచ్చమ్మ పేరంటాలు ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పెదవేగి, జనవరి 16: గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలకు పోస్టర్‌ను ఆలయకమిటీ సభ్యులతో కలసి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మంగళవారం ఆవిష్కరించారు. జిల్లాలో పేరుగాంచిన అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలు ప్రతి సంవత్సరం ఎంతో వైభవంగా జరుగుతాయన్నారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, సంతానలక్ష్మిగా, అమ్మలగన్న అమ్మగా ప్రసిద్ధిగాంచిన అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాల జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలి వస్తారన్నారు. అలాంటి అమ్మవారి ఆలయం తన నియోజకవర్గంలో ఉండడం తన అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో గాలాయగూడెం సొసైటీ అధ్యక్షుడు తోట అచ్చియ్య, ఆలయ కమిటీ సభ్యులు గంటా కోటేశ్వరరావు, సుబ్బారావు, పెద్దిశెట్టి నాని, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.


ఏలూరు రూరల్ మండలంలో పతంగులతో బాల బాలికల సందడి


నాయుడుగూడెంలో కలుసుకున్న నాలుగు తరాల వారు

సంక్రాంతి సంబరాలు

ఏలూరు రూరల్, జనవరి 16: జిల్లాలో సంక్రాంతి పండుగ ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. ప్రతి గ్రామంలో పండుగ సందడి నెలకొంది. పలు ప్రాంతాల్లో నిర్వహించిన ముగ్గులపోటీలు, పతంగులతో యువత సందడి చేశారు. వృత్తిరీత్యా విద్యకోసం ఎక్కడికి వెళ్ళినా పండుగ జరుపుకోవడానికి స్వగ్రామాలకు చేరుకున్నారు. నూతన వస్త్రాలు, పిండి వంటకాలతో మకర సంక్రాంతిని ఘనంగా జరుపుకున్నారు. కనుమ సందర్భంగా మంగళవారం రైతన్నలు పశువులకు పూజలు చేశారు. పితృదేవతల పేరిట బ్రాహ్మణులకు స్వయంపాకాలు అందజేశారు. చాటపర్రు గ్రామం గీతాకాలనీలో ఏపీ మహిళా సమాఖ్య, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామాల్లో యువతీ యువకులకు, బాలబాలికలకు, మహిళలకు ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

● పెదపాడు: సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. సత్యవోలులో గ్రామ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు జడ్పీ ఛైర్మన్ పద్మశ్రీ బహుమతులు అందజేశారు. ఘంటా ప్రసాదరావు, వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి, ధనుంజయ పాల్గొన్నారు.

● పెదపాడు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నాలుగు తరాల ఆత్మీయ కలయికకు నాయుడుగూడెం గ్రామం వేదికగా నిలిచింది. గారపాటి మైనర్ వారసులు దేశ, విదేశాల్లో స్థిరపడగా సంక్రాంతి పండుగకు వారంతా ఒకచోట చేరి సందడి చేశారు. అక్కా చెల్లెమ్మలు, తోడికోడళ్లు, మనుమలు, మనుమరాండ్రు అంతా కలిసి వందమందికి సంబరాలు చేసుకున్నారు.

● ఉంగుటూరు: కైకరంలో చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీటీసీ చెన్ను సత్యవాణి, ఉన్నమట్ల సునీత, బొడ్డు శాంత కుమారి, అక్కిన నాగమణి, యెగ్గిన శ్యామల, సిరిబత్తు కృష్ణ మోహన్, దూసనపూడి పుల్లయ్య, కరణం పెద్దిరాజు పాల్గొన్నారు.

సీపీఎం నేత ప్రకాశరావు మృతి



ఏలూరుటూటౌన్, జనవరి 16: సీపీఎం సీనియర్ నాయకుడు, కార్మిక నేత పల్నాటి సూర్యప్రకాశరావు మంగళవారం మృతి చెందారు. పడమరవీధి ఆయన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. పలువురు నాయకులు ఆయన మృతికి సంతాపం తెలిపారు. అంత్యక్రియల కార్యక్రమంలో సీపీఎం నేతలు జీ.నరసింహారావు, కె.రాజారామ్మోహన్‌రాయ్, కుమార్ పాల్గొన్నారు.

దురలవాట్లు ప్రోత్సహిస్తున్న వైసీపీ

ఏలూరు టూటౌన్, జనవరి 16: వైసీపీ ప్రజాప్రతినిధులే కోడిపందేలు, జూదం, మద్యం, చెడు అలవాట్లను పోత్సహిస్తూ యువతను చెడుమార్గం పట్టిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. ఇదేనా రాష్ట్ర అభివృద్ధి అని ప్రశ్నించారు. ఇందుకేనా వైసీపీని అధికారంలోకి తీసుకు రావాలా అని ప్రశ్నించారు. యువతకు మంచి క్రీడా పోటీలు నిర్వహించి క్రీడలవైపు ప్రోత్సహించాలని ఆయన సూచించారు. సంక్రాంతి పండుగ పేరుతో సంప్రదాయం అంటూ కోడి పందేలు, జూదం విచ్చలవిడిగా సాగుతున్న పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించడం తగదన్నారు.

19న హిందూ ప్రజావేదిక

ఏలూరు టూటౌన్, జనవరి 16: హిందూ ధర్మ రక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 19న వైఎంహెచ్‌ఏ హాలులో హిందూ ప్రజావేదిక సభ నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి లక్కోజు అనీల్‌ఆచార్య తెలిపారు. హిందువుల ఐక్యతను చాటిచెప్పే సభకు హిందువులంతా హాజరు కావాలన్నారు. అయోధ్య అక్షింతలు స్వామివారి చిత్రపటం అందజేస్తామన్నారు. సభకు స్వామిజీలు, మాతాజీలు హాజరవుతారని అన్నారు.

లింగపాలెం మండలంలో జూదరుల అరెస్ట్


లింగపాలెం, జనవరి 16: మండలంలోని పలు గ్రామాల్లో జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. కలరాయనగూడెం, ములగలంపాడు, ధర్మాజీగూడెం గ్రామాల్లో కోడిపందేలు, పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. కోడిపందేలు వేస్తున్న 8మందిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి నాలుగుకోళ్ళు, రూ.2,150 నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకముక్కలు ఆడుతున్న 8మందిని అరెస్టుచేసి రూ.2,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పి.చెన్నారావు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సైతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.


నరసాపురం ఎంపీ కనుమూరి రఘు రామకృష్ణరాజును టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు మంగళవారం ఆయన నివాసంలో కలిశారు.


సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి అప్పలనాయుడు


జగన్‌కు ఇంటి బాట తప్పదు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 16: ప్రజా వ్యతిరేక విధానాలతో నియంతలా పరిపాలిస్తున్న సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో పరాభవం తప్పదని, ఇంటిబాట పట్టక తప్పదని జనసేన జిల్లా అధికార ప్రతినిధిరెడ్డి అప్పలనాయుడు అన్నారు. నగరంలో మంగళవారం పలు చోట్ల సమావేశాలు నిర్వహించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. వైసీపీ పరిపాలన తీరుపై వివరాలు కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ పరిపాలనపై ప్రజలు విసుగు చెందారని, అన్ని వ్యవస్థలు కూడా నిర్వీర్యమయ్యాయని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు కూడా జగన్ పరిపాలనపై అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రం తిరోగమనంలో ఉందన్నారు. ప్రజలకు సరైన పరిపాలన అందించాలంటే వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ కూటమి విజయం సాధించాలన్నారు. ప్రజలు కూడా అదే కోరుకుంటున్నారని చెప్పారు. ప్రజలపై ప్రభుత్వం అనేక భారాలు మోపుతుందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ విస్మరించారన్నారు. గత టీడీపీ పాలనలో 80 శాతం పూర్తయిన టిడ్కో ఇళ్లు నాలుగున్నర సంవత్సరాల్లో మిగిలిన 20 శాతం పూర్తి చేయలేకపోయారని, ప్రజలకు ఇళ్ళు ఇవ్వలేకపోయారని ఆయన విమర్శించారు. చెప్పేదానికి చేసేదానికి పొంతన లేదన్నారు. ఆయన వెంట జనసేన నాయకులు నగిరెడ్డి కాశీ నరేష్, సరిది రాజేష్, అల్లు సాయిచరణ్, బొత్స మధు తదితరులు ఉన్నారు.


లింగపాలెంలో చప్పట్లు కొట్టి అంగన్వాడీల నిరసన


పోలవరంలో అంగన్వాడీల నినాదాలు


చింతలపూడిలో నిరసన శిబిరంలో అంగన్వాడీలు


కామవరపుకోటలో అంగన్వాడీల నిరసన

సమ్మె ఉధృతం

సమస్యలపై అంగన్వాడీల పోరు

ఏలూరు రూరల్, జనవరి 16: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె ఉధృతంగా సాగుతోంది. పండుగరోజు సైతం సమ్మెలో పాల్గొని ఆందోళనను కొనసాగించారు. మంగళవారం 36వరోజుకు చేరింది. కైకలూరు, చాత్రాయి, చింతలపూడి, కొయ్యలగూడెం, పోలవరం, ఏలూరు, జంగారెడ్డిగూడెం నియోజకవర్గాల్లో అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పలుచోట్ల అంగన్‌వాడీలు జగన్‌కు సాష్టాంగ నమస్కారం చేసి ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించండి జగన్ సార్ అంటూ విజ్ఞప్తి చేశారు. సమ్మె శిబిరం వద్ద రిలే దీక్షలు కొనసాగుతున్నాయి.

● చింతలపూడి: అంగన్‌వాడీలు పండుగను కూడా వదులుకుని 36వ రోజు సమ్మె శిబిరంలో పాల్గొన్నారు. సమస్యల పరిష్కారానికై శిబిరంలో తప్పట్లు కొడుతూ నినాదాలు చేశారు. ప్రాజెక్టు జేఏసీ నాయకురాలు టి.మాణిక్యం మాట్లాడుతూ ఒక పక్క కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన నలుగురు నాయకులు విజయవాడలో నిరవధిక నిరాహార దీక్షలో పాల్గొంటారని ఆమె తెలిపారు. రాబోయే రోజుల్లో దీక్షలు చేస్తున్న వారికి సంఘీభావంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నామని, ప్రభుత్వం సత్వరమే నిర్ణయం ప్రకటించారు. పద్మ, శ్యామల, సీతామహాలక్ష్మి, రజియ, సుజాత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని 36 రోజులుగా అంగన్‌వాడీలు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటం మహిళా లోకాన్ని అవమానించినట్టేనని సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్.రాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలను పరామర్శించారు. ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని, ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరారు. అంగన్‌వాడీలు పుష్పరాజ్యం, బి.శాంతి, పాప, రాణి, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొద్దిసేపు నినాదాలు చేశారు.

● పోలవరం: అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ మండల కార్యదర్శి పీఎల్ఎస్ కుమారి డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమ్మె నాటికి 36వ రోజుకు చేరుకుంది. అంగన్వాడీల ఉద్యమం అణచివేత చర్యలు దుర్మార్గమని, నోటీసులు ఇచ్చి 18వ తేదీలోగా విధులకు హాజరుకాకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని బెదిరింపులకు ధోరణులకు పాల్పడడం ప్రభుత్వానికి తగదన్నారు. అంగన్వాడీలు చెరుకూరి మణి, పద్మ, సరస్వతి, హైమవతి, కుబ్ర, జుబేద, వెంకటరమణ, సత్యవతి, విజయ తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: సమస్యలు పరిష్కరించాలంటూ టి.నరసాపురం మండలంలో తహసీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం దీక్షను కొనసాగించారు. దీక్ష శిబిరం వద్ద అంగన్‌వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు.

● కుక్కునూరు: అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలంటూ కుక్కునూరులో గంగిరెడ్డుకు వినతిపత్రం అందజేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. సమ్మె శిబిరంలోనే పిండివంటలు చేశారు. 36 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన మాని సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు మండల కార్యదర్శి వైసాయికిరణ్, సుజాత, అలివేలు, లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 36వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీలు మాట్లాడుతూ సమ్మె చేస్తుంటే జగన్మోహన్‌రెడ్డికి చీమకుట్టినట్లు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని వారన్నారు. అంగన్‌వాడీ నాయకులు టీజేఎన్ కుమారి, వి.ఈశ్వరి, పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన అంగన్వాడీల నిరసన కార్యక్రమాలు 36వ రోజు కొనసాగాయి. శిబిరాల వద్ద ముగ్గులు వేసి నిరసనలు తెలిపారు. రోజుల తరబడి నిరసన చేపడుతున్నప్పటికి ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి పండుగను ఆనందంగా చేసుకునే తామంతా ఇలా నిరసన కార్యక్రమాల్లో కూర్చోనేవిధంగా చేయడం బాధాకరమన్నారు.

● బుట్టాయగూడెం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి 36వ రోజుకు చేరుకుంది. మొక్కవోని పట్టుదలతో అంగనవాడీలు డిమాండ్ల సాధనకు సమ్మె కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరుతున్నారు. కృపామణి, నూర్జహాన్, శ్రీదేవి, మహలక్ష్మి, పుష్ప, మున్నీ అంగనవాడీలు పాల్గొన్నారు.


కైకలూరు మండలంలో తలపడుతున్న కోళ్ళు


జనార్దనవరం కోడి పందేల్లో సిట్టింగ్ సదుపాయం


ముదినేపల్లిలో కోడిపందేలు


నూజివీడు బరిలో నువ్వా నేనా..

కోళ్లు.. కోట్లు

» యథేచ్ఛగా కోడి పందేలు » చేతులు మారిన కోట్లు » బరుల వద్ద సిట్టింగ్ ఏర్పాటు » కానరాని పోలీసులు

అధికారుల హెచ్చరికలు బేఖాతరయ్యాయి. పండుగ మూడు రోజులు కోడి పందేలు యథేచ్ఛగా సాగాయి. కోడి పందేలతో పాటు ఇతర జూద క్రీడలు సాగాయి. మద్యం ఏరులై పారింది. కోట్లాది రూపాయలు చేతులు మారాయి. బరుల వద్ద నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కుర్చీలు ఏర్పాటు చేశారు. దానికి సొమ్ము వసూలు చేశారు. ఇంత జరుగుతున్నా పోలీసులు కానరాలేదు. మంగళవారం సాయంత్రం అక్కడక్కడ బరుల వద్ద ప్రత్యక్షమై జూదం నిలుపు చేయించారు.

నూజివీడు, జనవరి 16: సంక్రాంతికి కోడిపందేలు జోరుగా సాగాయి. నూజివీడు మండలం పరిధిలోని నూజివీడు, పోతురెడ్డిపల్లి, రావిచర్ల, తుక్కులూరు గ్రామాలపరిధిలో భారీగా టెంట్‌లతో అత్యాధునిక సౌకర్యాలతో ఈ పందేలు సాగాయి. పందేల్లో పాల్గొనేందుకు హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని అనేక ప్రాంతాల నుంచి పందెం రాయుళ్ళు గత మూడు రోజుల నుంచి నూజివీడు మండలంలోని తమ స్వగ్రామాలకు చేరుకోగా, వారి స్నేహితులు సైతం కోడిపందేలకు సై అంటూ నూజివీడుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కోడిపందేలతో పాటు బరులవద్ద పేకాట, గుండాట, కోతముక్క శిబిరాలు కొనసాగాయి. పోలీసుల హెచ్చరికలు బేఖాతరయ్యాయి. మండలంలో మూడు రోజుల్లో సుమారు రూ.25 కోట్ల వరకు బెట్టింగ్ జరిగినట్లు అంచనా. పందేనికి మూడు నుంచి ఐదు లక్షల వరకు చేతులు మారాయి. నూజివీడు మండలంలో నిర్వహించే కోడిపందేలు చూడాలంటే ఖచ్చితంగా ఎంట్రీపాస్‌లు ఉండాల్సిందే. నూజివీడు పట్టణంలో నిర్వహించిన కోడిపందేల్లో అత్యధిక పందేలు గెలిచిన వారికి రాయల్ ఎన్‌ఫీల్డ్‌ను బహుమతిగా ప్రకటించారు. ప్రధానంగా సంక్రాంతి రోజు నిర్వహించిన ఐదు పందేల్లో మూడు పందేలను గెలిచిన మండవ అశోక్ ఈ ఎన్‌ఫీల్డ్‌బైక్‌ను సొంతం చేసుకున్నారు. చింతలపూడికి చెందిన వారికి నూజివీడుకు చెందిన అశోక్‌కు మధ్య ఈ పోటీలు సాగగా, అధిక పందేలను గెలిచినందుకు గాను ఎన్‌ఫీల్డ్ బైక్‌ను ఆయన గెలుచుకున్నారు.

చాట్రాయి: మండలంలో జనార్దనవరం, చిన్నంపేట గ్రామాల్లో పండుగ మూడు రోజులు కోడి పందేలు నిర్వహించారు. జనార్దనవరం బరిలో పందెం రాయుళ్ళు పేక్షకుల కోసం రూ. 200 టిక్కెట్టుపై సిట్టింగ్ సదుపాయం కల్పించి వారికి భోజన ఏర్పాట్లు చేశారు. చుట్టు పక్కల మండలాలలో ఎక్కువ చోట్ల పందేలు జరగటంతో గతం కంటే తక్కువ సంఖ్యలో పందెంరాయుళ్ళు హాజరయ్యారు. కోసు ఆటలు, గుండాటలు నిర్వహించారు.

ముసునూరు: లోపూడి, గోపవరం బరుల్లో జరిగిన భారీ స్థాయి కోడి పందేలకు సిట్టింగ్, ఎల్‌ఈడీ స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. పేకాట, గుండాట జోరుగా సాగింది. ఫ్లడ్‌లైట్స్ వెలుగుల్లో పందేలు వేశారు. ప్రజాప్రతినిధులు సైతం పందేలను వీక్షించారు. మూడు రోజులు కత్తులు కట్టి లక్షల్లో పందేలు జరిగినా పోలీసులు పట్టించుకోకపోవడం విశేషం.

కైకలూరు: ఆటపాక, వదర్లపాడు, వరహాపట్నం, రాచపట్నం, ఆచవరం ,డొడ్డిపట్ల, పందిరిపల్లిగూడెం, శృంగవరప్పాడు, కొట్టాడ గ్రామాల్లో కోడిపందేలతో పాటు పేకాట, గుండాట భారీగా నిర్వహించారు. కోట్లలో నగదు చేతులు మారింది. పందెం రాయుళ్ల కోడిపందేలతో పాటు పేకాట, గుండాటను భారీగా చేపట్టారు. యువత పెద్ద ఎత్తున పాల్గొని వేలు, లక్షల్లో పందేలు కాశారు.

మండవల్లి: పందేలు నిషేధమని పదేపదే అధికారులు ప్రకటించినా నిర్వాహకులు ఖాతరు చేయలేదు. పండుగ మూడు రోజులు కోడికత్తి ఎగిరి పడింది. లక్షల రూపాయలు చేతులు మారాయి. మండలంలో చింతపాడు, ఇంగిలిపాకలంక, పెరికెగూడెం, కానుకొల్లు, భైరవపట్నం గ్రామాల్లో భారీగా కోడిపందేలు, జూదం సాగింది. అధికారుల జాడలేదు.

ముదినేపల్లి: ముదినేపల్లి, బొమ్మినంపాడు, అల్లూరు, పేరూరు తదితర చోట్ల కోడిపందేలు భారీగా జరిగాయి. మండలంలో మూడు రోజులుగా జరిగిన పందేల్లో సుమారు రూ.5 కోట్ల మేర చేతులు మారినట్లు సమాచారం. మండలంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు కోడిపందేలకు పోలీసులు అడ్డుకట్ట వేశారు. ముదినేపల్లి, అల్లూరు, బొమ్మినంపాడు బరుల వద్ద ఏర్పాటు చేసిన షామియానా తొలగించారు. ఎస్‌ఐ వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది జూదం నిలిపివేశారు. పేరూరులో స్వచ్ఛందంగా నేతలు తొలగించారు.

ముదినేపల్లి రూరల్: మూడు రోజులుగా జరుగుతున్న కోడి పందేలు, జూద క్రీడల్లో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. వడాలి, దేవపూడి బరుల్లో అధికార పార్టీ నాయకులు కోసు నిర్వహించారు. బరిలో మద్యం ఏరులై పారింది. వడాలి బరిలో ఒక వ్యక్తికి కోడికత్తి చేతికి తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. సాయంత్రం 5 గంటలకు పోలీసులు రావడంతో పందెం రాయుళ్ళు వెనుదిరిగారు.

కలిదిండి: కలిదిండి, తాడినాడ, పెదలంక, కొండంగి, సానారుద్రవరం గ్రామాల్లో జోరుగా కోడిపందేలు జరిగాయి. తాడినాడ, కలిదిండి బరుల్లో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. రాత్రిపూట ఫ్లడ్ లైట్ల వెలుతురులో కోడిపందేలు జరిగాయి. పందేల్లో సొమ్ము పోగొట్టుకున్న పేద, మధ్య తరగతి వారు ఉసూరుమంటూ వెనుదిరిగారు. బరుల్లో గంప కింద ఉన్న పందెం పుంజులు అపహరణకు గురవటంతో బాధితులు లబోదిబోమన్నారు. మూడు రోజుల్లో సుమారు రెండు కోట్ల రూపాయలు చేతులు మారినట్టు సమాచారం.


దొరసానిపాడులో ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

అట్టహాసంగా శ్రీవారి పార్వేటి ఉత్సవం

» దొరసానిపాడు కనుమ మండపంలో విశేష పూజలు

ద్వారకాతిరుమల, జనవరి 16: చిన్నతిరుమలేశుని పార్వేటి మహోత్సవం (కనుమఉత్సవం) భక్తుల గోవిందనామస్మరణలు, అర్చకుల వేదమంత్రోచ్ఛరణలు, కేరళ వాయిద్యాలు, డోలు, సన్నాయి, చిత్రవిచిత్రవేషధారణల నడుమ మంగళవారం సాయంత్రం అట్టహాసంగా జరిగింది. ఉభయదేవేరులతో శ్రీవారిని రాజాధిరాజ వాహనంపై ఉంచి ప్రధాన రాజగోపురం మీదుగా గజ, అశ్వసేవల నడుమ పురవీధులకు పయనమై దొరసానిపాడుకు తరలివెళ్లారు. మహిళలు స్వామి వాహనం వచ్చే దారిపొడవునా రంగవల్లులతో తీర్చిదిద్దారు.

ఉత్సవ వైభోగం ఇలా.. శ్రీవారి క్షేత్రం నుంచి ఊరేగింపుగా వెళ్లిన స్వామివారు అక్కడి కనుమమండపం వద్ద భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదేవేరులతో శ్రీవారిని ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలను నైవేద్యం చేశారు. భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం శ్రీవారు గిరిప్రదక్షిణగా శేషాచలకొండ మార్గాన తిరుగుతూ అట్టహాసంగా ఆలయానికి చేరుకున్నారు. ప్రతిఏటా శ్రీవారు కనుమ పండుగ రోజు మాత్రమే క్షేత్రాన్ని విడిచి పొరుగు గ్రామానికి వెళ్లడం ఇక్కడి విశిష్టత.

గరుడ వాహనంపై గోదాదేవి గ్రామోత్సవం



ముసునూరు, జనవరి 16: చెక్కపల్లి కోదండ రామాలయంలో గోదాదేవి కల్యాణాన్ని కన్నులపండువగా జరిపారు. సోమవారం మేళాతాళాలతో గరుడ వాహనంపై అమ్మవారికి వైభవంగా గ్రామోత్సవం జరిపారు. ఆలయ చైర్మన్ రాధాకృష్ణ, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్రైం కార్నర్


ఎంపీటీసీ ఇంటి వద్ద మృతదేహంతో బంధువుల ఆందోళన (ఇన్‌సెట్) ఫణీంద్ర (ఫైల్)

యువకుడి అనుమానాస్పద మృతి

» మృతదేహంతో బంధువుల ఆందోళన

» ఎంపీటీసీని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కలిదిండి, జనవరి 16 : కొండంగి గ్రామానికి చెందిన కోకా ఫణీంద్ర (27) రొయ్యల చెరువుల వద్ద ఉన్న పాకలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు, మృతుడి బంధువుల కథనం ప్రకారం తన సోదరుడి కుమార్తెతో మృతుడు చనువుగా ఉండటంతో ఎంపీటీసీ ఇమ్మానేని లక్ష్మణరావు ఫణీంద్రను హత్య చేయించాడంటూ మంగళవారం కొండంగిలో ఎంపీటీసీ నివాసం వద్ద మృతుడి బంధువులు ఫణీంద్ర మృతదేహంతో ఆందోళన చేశారు. ఎంపీటీసీ ఇంటిని, కారును ధ్వంసం చేసి ఎంపీటీసీని అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఎంపీటీసీ లక్ష్మణరావును అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కైకలూరు సీఐ కృష్ణకుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కలిదిండి ఎస్‌ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

ముసునూరు, జనవరి 16: మండలంలోని చింతలవల్లిలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ ఎం.కుటుంబరావు వివరాల ప్రకారం చింతలవల్లి ఎస్సీ కాలనీకి చెందిన పల్లిపాము కిశోర్‌కు ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం కీర్తిరాయునిగూడెంకు చెందిన శీలం కోటేశ్వరమ్మ (28)కు తొమ్మిదేళ్ళ క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. సోమవారం ఉదయం ఫ్యాన్‌కు కోటేశ్వరమ్మ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాత్‌రూమ్‌కి వెళ్ళివచ్చిన అత్త మార్తమ్మ చూసి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారి కోటేశ్వరమ్మను కిందకు దింపి నూజివీడు ఆమెరికన్ ఆసుపత్రికి తరలించగా ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తన కూమార్తె మృతిపై అనుమానం ఉందని తండ్రి శీలం బుజ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దొంగలకు దేహశుద్ధి



ముదినేపల్లి, జనవరి 16 : దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులకు గ్రామస్థులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన బొమ్మినం పాడులో మంగళవారం సాయంత్రం జరిగింది. గ్రామంలో కోడిపందేలు చూస్తున్న వైవాక గ్రామానికి చెందిన రాము జేబు నుంచి రూ. 10 వేలు, మణికర్ జేబు నుంచి సెల్‌ఫోన్‌ను చోరీ చేసి పారిపోతున్న దొంగలను గ్రామస్థులు పట్టుకుని చేతులు, కాళ్లు కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ వెంకట్ కుమార్ నిందితుల అదుపులోకి తీసుకున్నారు. వారు గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన వారుగా గుర్తించారు. బరి వద్ద ఒక బైక్‌ను కూడా వీరు దాచినట్లు తెలిసింది.

ఆగని అంగన్వాడీల నిరసనలు


నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద కళ్ళకు గంతలతో నిరసన

నూజివీడు టౌన్, జనవరి 16: ప్రభుత్వం తమకు పండుగ లేకుండా చేసిందని అంగన్‌వాడీలు కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం అంగన్‌వాడీలు పండుగ రోజుల్లోను తమ నిరసనను కొనసాగించారు. అంగన్‌వాడీలు తమ డిమాండ్లు సాధించేవరకు విశ్రమించబోరని సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌ఆర్ హనుమాన్లు, జి.రాజు అన్నారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, జ్యోతి, ఝాన్సీ, ప్రసన్న, విజయలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: ప్రభుత్వం దిగివచ్చి తమ న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించే వరకు సమ్మె ఆపే ప్రసక్తే లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. చాట్రాయి తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన దీక్ష కొనసాగింది. యూనియన్ నాయకులు విజయ, ప్రమీల వర్కర్స్ హెల్పర్స్ పాల్గొన్నారు.

ముగ్గులు వేసి నిరసన..

ముసునూరు: ముసునూరులో దీక్షా శిబిరం వద్ద అంగన్‌వాడీలు ముగ్గులు వేసి నిరసన తెలిపారు. ప్రజలంతా సంక్రాంతిని కుటుంబ సమేతంగా జరుపుకుంటుండగా ప్రభుత్వం తమ కుటుంబాల్లో పండుగ లేకుండా చేసిందని వర్కర్స్ యూనియన్ నియోజకవర్గ కార్యదర్శి పి.రాజకుమారి అన్నారు. తమ డిమాండ్‌లను పరిష్కరించకపోతే ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని అంగన్‌వాడీలు హెచ్చరించారు.

కలిదిండి: తమ డిమాండ్లను పరిష్కరించాలని మంగళవారం కలిదిండిలో అంగన్‌వాడీలు సంక్రాంతి ముగ్గులు వేసి నిరసన తెలిపారు. పండుగ పూట పస్తులుండి నిరసన తెలిపినా ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోకపోవటం దారుణమన్నారు. అంగన్‌వాడీ నేతలు అబిదా బేగం, విజయలక్ష్మి, శాంతకుమారి, లావణ్య, రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో మౌన దీక్ష..

ముదినేపల్లి: అంగన్‌వాడీల సమ్మె మంగళవారం నాటికి 36వ రోజుకు చేరింది. మౌన దీక్షతో నిరసన తెలిపారు. మంగళవారం శిబిరాన్ని సందర్శించిన సీఐటీయూ జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.

ప్రభుత్వం దిగివచ్చేవరకు సమ్మె ఆగదు..

కైకలూరు: మంగళవారం కైకలూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు 36వ రోజు దీక్షా నిర్వహించారు. పండుగను సైతం లెక్కచేయకుండా శిబిరం వద్దే ముగ్గులు వేసి పాటలు పాడుతూ నిరసన తెలిపారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు సమ్మె చేస్తామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు ఎల్. మీనాకుమారి, ఝాన్సీ, విజిత, రమణ తదితరులు పాల్గొన్నారు.

గాలిపటాలు ఎగురవేసి నిరసన

మండవల్లి: మండవల్లి తహసీల్దార్ కార్యాలయం కనుమ రోజు గాలిపటాలు ఎగురవేసి నిరసన తెలిపారు. 36 రోజులు సమ్మె చేస్తున్నా జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదని అంగన్‌వాడీ నాయకురాలు చెల్లమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు.



ముదినేపల్లిలో బొమ్మలకొలువు.. సింగరాయపాలెంలో గోపూజ


నూజివీడులో క్రీడా పోటీలు..

రావమ్మా మహాలక్ష్మి రావమ్మా..

ఘనంగా సంక్రాంతి వేడుకలు

నూజివీడు టౌన్, జనవరి 16: సంక్రాంతిని పురస్కరించుకుని ఎక్కడెక్కడో స్థిరపడిన వారు సంక్రాంతి సందర్భంగా స్వగ్రామాలకు తరలి వచ్చారు. నూజివీడు మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన పలువురు దేశ, విదేశాల్లో వివిధ స్థాయిల్లో స్థిరపడ్డారు. ఎవరు ఎక్కడ ఉన్నా సంక్రాంతిరోజున కలుసుకోవాలనే మాట ప్రకారం వరుసగా 9వ ఏడాది కలుసుకుని సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. వీటితో పాటు కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో వయస్సుతో సంబంధం లేకుండా అన్ని వయస్సుల వారు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారికి సర్పంచ్ సత్యవాణి కృతజ్ఞతలు తెలిపారు.

ముదినేపల్లి: సంక్రాంతిని ముదినేపల్లి వాసులు ఘనంగా జరుపుకున్నారు. పలు చోట్ల బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. పిల్లలకు భోగి పండ్లు పోశారు. మంగళవారం ఇళ్ల ముందు రథం ముగ్గులు వేశారు.

ముదినేపల్లి రూరల్: మంగళవారం చేవూరుపాలెం, సింగరాయపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో గోవులకు శ్రీహరిపురం సర్పంచ్, దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ మాజీ చైర్మన్ పర్సా విశ్వేశ్వరరావు గోపూజ నిర్వహించారు. కనుమరోజు గోవులను ప్రత్యేకంగా పూజిస్తారని పేర్కొన్నారు.

కలిదిండి: మండలంలో సంప్రదాయ బద్ధంగా మకర సంక్రాంతి, కనుమ పండుగలు ఘనంగా జరిగాయి.



ఇళ్ల ముంగిట రంగవల్లులు తీర్చిదిద్ది గొబ్బెమ్మలను పెట్టి మహిళలు గొబ్బి పాటలు పాడారు. కనుమ రోజు పశువులకు రైతులు పూజలు చేసి వాటి కొమ్ములకు రంగులు వేసి అరటి పండ్లు తినిపించారు. గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు.



హోరాహోరీగా బాస్కెట్ బాల్ పోటీలు

నూజివీడు టౌన్, జనవరి 16: కళాప్రపూర్ణ రాజా వెంకటాద్రి అప్పారావు బహదూర్ 47వ స్మారక బాస్కెట్‌బాల్ పోటీలను నూజివీడు డీఏఆర్ కళాశాలలో మంగళవారం ప్రారంభించారు. నూజివీడు నియోజకవర్గ టీడీపీ నాయకులు పర్వతనేని గంగాధర్, నూతక్కి వేణుగోపాలరావు, డీఏఆర్ కళాశాల చైర్మన్ అప్పారావు ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. లీగ్ కమ్ నాకౌట్ విధానంలో సాగిన క్రీడా పోటీలలో మొదటి రెండు రోజుల్లో పది పోటీలు సాగాయి. పురుషుల విభాగంలో తొలుత ఆర్టిలరీ, మిస్టెయిల్ ఏలూరు మధ్య పోటీ సాగగా, 61-13 స్కోరుతో ఆర్టిలరీ విజయం సాధించింది. అనంతరం నెల్లూరు, గుంటూరు జట్ల మధ్య జరిగిన పోటీలో 49-48 స్కోరుతో నెల్లూరు గెలిచింది. అనంతరం వాయల్‌పాడు, వి.టి.హెచ్ నూజివీడు మధ్య సాగిన పోటీలో 45-44 స్కోరుతో వాయల్‌పాడు గెలుపొందగా ఏ.బి.ఏ గుడివాడ జట్ల మధ్య జరిగిన పోటీలో 30-28 స్కోరుతో ఏబీఏ గెలుపొందింది.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ముసునూరు, జనవరి 16: మండలంలోని రమణక్కపేట జడ్పీ హైస్కూలు 1998-99 టెన్త్ బ్యాచ్ పూర్వవిద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. నాటి హెచ్‌ఎం ప్రసాదరావు మాట్లాడుతూ 25 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణారావుకు పూర్వ విద్యార్థులు రూ.12 వేలు విలువగల బీరువాను అందజేశారు.

బాధిత కుటుంబానికి మాగంటి పరామర్శ



కైకలూరు, జనవరి 16: మండవల్లి మండలం కానుకొల్లులో ఈ నెల 14న ముగ్గు వేస్తుండగా లారీ ఢీకొని పగిళ్ళ నాగబాబు కుమార్తె తేజశ్రీ మృతి చెందగా, పల్లవి దుర్గ గాయాల పాలై గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం విదితమే. మాజీ ఎంపీ మాగంటిబాబు పల్లవి దుర్గను పరామర్శించారు. తాము అండగా ఉంటామని దుర్గ తండ్రి నాగబాబుకు హామీ ఇచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథ్‌రాజు, చల్లగుళ్ళ శోభనాద్రిచౌదరి, ఎన్‌వీవీ నాగేశ్వరరావు, ఈడ్పుగంటి శ్రీనివాస్ తదితరులు పరామర్శించారు.

ఆక్వా రైతులకు ఆక్సిజన్!

చంద్రబాబు ప్రకటనతో ఆశలు

» మేతల ధరలు, మద్దతు ధర, సాగుప్రోత్సాహంపై నూతనోత్సాహం

» సంక్షోభానికి తెరపడుతుందని ఆనందం

» జోన్ పేరుతో వైసీపీ దగా..

» ఉమ్మడి పశ్చిమలో 1,80,000 ఎకరాల్లో సాగు

టీడీపీ అధినేత చంద్రబాబు ఆక్వారైతుల్లో ఆశలు రేకెత్తించారు. పెరిగిన మేత ధరలు, విద్యుత్ సబ్సిడీలు తగ్గడం, రొయ్యల ధరలు పతనమవడంతో తీవ్ర నిరాశ నిస్పృహల్లో ఉన్న ఆక్వా రైతన్నలకు ఆచంట మహాసభలో చేసిన ప్రకటన ఆక్సిజన్ ఇచ్చింది. ప్రస్తుత పరిస్థితులకు పూర్తి భిన్నంగా అన్నింటికీ సబ్సిడీలు వర్తింపజేస్తామని చెప్పడం, మేత ధరలు తగ్గిస్తామని, ఆక్వాజోన్‌తో సంబంధం లేకుండా విద్యుత్ యూనిట్ రూ.1.50కు, సబ్సిడీతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు తోడ్పడతామని చెప్పడంతో రైతుల్లో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వారిలో కొత్త ఆశలు చిగురించాయి.


ఆచంట సభలో ప్రకటన చేస్తున్న చంద్రబాబు (ఫైల్), మద్దతు ధర లేని రొయ్యలు

ఆకివీడురూరల్ జనవరి 16: ఉమ్మడిపశ్చిమ గోదావరి జిల్లాలో 1,80,000 ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. అనుమతి పొందని మరో 50వేల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు.చంద్రబాబు హయాంలో ఇచ్చిన ప్రోత్సాహకాలతో జిల్లాలో 2014-2019 మధ్య ఆక్వా సాగువిస్తీర్ణం గణనీయంగా పెరిగింది. సబ్సిడీపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, యూనిట్ కేవలం రూ.1.50కే ఇవ్వడం, నాణ్యమైన సీడ్ లభించడం, ధరలు అదుపులో ఉండటంతో ఆక్వా ద్వారా సుమారు రూ.25 వేల కోట్లు వార్షికాదాయం వచ్చేది. విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఆక్వాసాగు చేస్తున్న వారందరికి యూనిట్ ధర కేవలం రూ.1.50, 40 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కేవలం సబ్సిడీతో రూ.1.10 లక్షలకే ఏర్పాటు చేసేవారు. దీంతో వ్యవసాయాన్ని మార్పు చేసి ఆక్వా సాగువైపు మొగ్గు చూపారు. ఆక్వాసాగుకు అవసరమైన పరికరాలు సబ్సిడీపై అందజేసి ప్రోత్సహించారు.

వైసీపీ పాలనలో ఆక్వా అధోగతే ..

టీడీపీ హయాంలో ఉవ్వెత్తున లేచిన ఆక్వాసాగు వైసీపీ పాలనలో ఢమాల్ అంది. దీనికి ప్రభుత్వ నిర్ణయాలే కారణమని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్వాజోన్ పేరుతో రైతులకు విద్యుత్ సబ్సిడీని నిలిపివేసిందని, ముందుగా ఐదు ఎకరాలు ఆ తరువాత 10 ఎకరాలకు పెంచుతూ సహేతుకమైన నిర్ణయాలు తీసుకోకపోవడం వలన విద్యుత్ సబ్సిడీ పొందలేక నష్టాల పాలయ్యారు. 40 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రూ.2.43 లక్షలకు పెంచడం .. సబ్సిడీ లేకపోవడం వారిని మరింత ఇబ్బందుల పాల్జేసింది. ధరలు పతనమవుతున్నా, నష్టాల పాలవుతున్నా పట్టించుకోకపోవడంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. మేతలు, మందుల ధరలు విపరీతం గా పెరిగిపోవడం, రొయ్యలు ధరలు తగ్గిపోవడం, వ్యాపారులు సిండికేటై ధరలు తగ్గించేసినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండటంతో ఆక్వారంగం సంక్షోభంలో కూరుకుపోయింది. నష్టాలు తట్టుకో లేక, అప్పులు పాలై రైతులు సుమారు 30వేల ఎకరాలలో సాగు ఆపేసారని సమాచారం. ఉమ్మడి జిల్లాలో సుమారు 21,000 విద్యుత్ కనెక్షన్లు ఉండగా 16,800 కనెక్షన్లకు సబ్సిడీ వర్తిస్తుండగా మరో 4,200 కనెక్షన్లకు సబ్సిడీ లేక ఇబ్బందులు పడుతున్నారు. అతి తక్కువ సమయంలో అధికాదాయం ఆర్జించే ఆక్వారంగం సంక్షోభంలో ఉండటం మిగిలిన అన్ని రంగాలపై ప్రభావంచూపుతోంది. మార్కెట్‌లో అన్ని రంగాలు వ్యాపారాలు లేక వెలవెలబోతున్నాయి. పండుగలు సైతం సాదాసీదాగానే జరిగిపోతున్నాయి. ప్రజల్లో ఇదివరకు ఉన్న హడావుడి, ఆనందోత్సహాలు లేకుండా పోయాయి.

వైసీపీవి మోసపూరిత వాగ్దానాలు



కోట్లాది రూపాయలు విదేశీయ మారకద్రవ్యం తీసుకువస్తున్న ఆక్వా రైతుల నడ్డిని వైసీపీ ప్రభుత్వం విరిచింది. విద్యుత్ సబ్సిడీని ఎత్తివేయడానికి అనేక సాకులు చూపింది. మోసపూరితమైన వాగ్దానాలతో తీవ్రంగా నష్టపోయారు.

భూపతిరాజు తిమ్మరాజు, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు

సంక్షోభంలో ఆక్వారంగం



ప్రభుత్వఅసంబద్ధ నిర్ణయాలతో ఆక్వారంగం సంక్షోభంలో ఉంది. విద్యుత్ యూనిట్ల విషయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం. విన్నపాలు పట్టించుకున్న నాథుడే లేడు.

-ముత్యాల బుజ్జి, వెస్ట్ గోదావరి ప్రాన్ ఫార్మర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు

గణనీయంగా తగ్గిన సాగు



ప్రభుత్వ నిర్ణయాల వలన సాగును గణనీయంగా తగ్గించేశారు. పెట్టుబడులు కూడా రావడం లేదు. ఆర్థిక స్థోమత లేక లీజుకు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. రొయ్యలసాగు ఆపేసి చేపల వైపు దృష్టి మరలిస్తున్నారు.

-దారపురెడ్డి కన్నబాబు, ఆక్వారైతు- కొల్లపర్రు

వ్యాపారులను నియంత్రించే చర్యలు నిల్



వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆక్వారంగం ఘోరంగా తయారైంది. నాణ్యతలేని సీడ్, ఫీడ్, మందులు, ధరలు ఆకాశన్నంటుతుంటే, రొయ్యల ధరలు పతనమై పోయాయి. వ్యాపారులను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడం లేదు.

- మద్రివాడ వెంకట్రావు, ఆక్వారైతు- చినకాపవరం